షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 213 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 15 జూన్ 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 213 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE June 15, 2024 PAGES : 8 PRICE : 3/-

## ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాల్సిందే

ఖజానా లోటు పూడ్చేందుకు కసరత్తు తప్పదు

ఆర్థికమంత్రి పయ్యావులు కేశవ్

అమరావతి,జూన్14(షణ్ముఖవెలుగు): ఎపి ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నం అయ్యిందని, ఆస్తులు, అప్పులు చూసి ముందుకు వెళ్లాల్సిన అసవరం ఉందని

మిగతా 2లో..





# అమోదయోగ్య శాఖల కేటాయింపు

## మంత్రులకు శాఖల కేటాయింపు

అమరావతి,జూన్14(షణ్ముఖవెలుగు): ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా కొలువైన మంత్రివర్గంలో చేరిన మంత్రులకు శాఖల కేటాయింపు జరిగింది. దీంతో ఎవరికి ఏయే శాఖలు అనేదానిపై ఇంతవరకూ నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. శుక్రవారం మధ్యాహ్నం మంత్రులకు శాఖలు కేటాయిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఇందులో జనసేన అధినేత పవన్ కల్యాణ్, యంగ్ లీడర్ నారా లోకేష్‌లకు కీలక శాఖలు ఇవ్వడం జరిగింది. అంతేకాదు.. యంగ్ మినిస్టర్లకు కీలక బాధ్యతలే చంద్రబాబు అప్పగించారు. ఇక హోం మంత్రి ఎవరవుతారనే దానిపై చంద్రబాబు పెద్ద ట్విస్టే ఇచ్చారు. ఎవరూ ఊహించని రీతిలో మహిళ, అందులోనూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వంగలపూడి అనితకు కేటాయించడం విశేషమని చెప్పుకోవచ్చు. అనుకున్నట్లుగానే పవన్ కళ్యాణ్‌కు డిప్యూటి సిఎంతో పాటు గ్రామీణాభివృద్ధిని కేటాయించారు. జనసేనలో మరో నేత నాదెళ్ల మనోహర్‌కు పౌరసరఫరాల శాఖ కేటాయించారు. వైకాపా ప్రభుత్వంలోనూ మహిళకే హోంశాఖ కేటాయించారు. దీనినే చంద్రబాబు కూడా కొనసాగించారు. మంత్రుల శాఖలు ఇలా ఉన్నాయి. కీలకమైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధితోపాటు.. గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం,

మిగతా 2లో..

- డిప్యూటి సిఎంగా పవన్ కళ్యాణ్
- పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు
- నారాలో కేశ్‌కు ఐటి,ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్
- అచ్చన్నాయుడుకు వ్యవసాయ శాఖ
- పయ్యావుల కేశవ్‌కు ఆర్థిక శాఖ
- వంగలపూడి అనితకు హోంమంత్రిత్వ శాఖ
- నాదెండ్ల మనోహర్‌కు పౌరసరఫరాల శాఖ
- సత్యకుమార్‌కు వైద్యారోగ్య శాఖలు కేటాయింపు



## పవన్ కల్యాణ్.. డిప్యూటీ సీఎం

అనుకున్నట్టుగానే పవన్ కళ్యాణ్ డిప్యూటి సిఎం పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, అటవీ శాఖలు

అమరావతి,జూన్14(షణ్ముఖవెలుగు): అనుకున్నట్లుగానే పవన్ కల్యాణ్ డిప్యూటి సిఎంగా తను కోరుకున్న పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను సాధించారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమక్షంలో నూతనంగా ఎన్నుకోబడిన కూటమి ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఏయే శాఖకు ఎవరెవరు మంత్రి అనే విషయాన్ని శుక్రవారం వరకు ప్రకటించలేదు. ప్రమాణ స్వీకారం అనంతరం చంద్రబాబు తిరుపతిలో తన మొక్కులు తీర్చుకుని, గురువారం సాయంత్రం అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజు అంటే శుక్రవారం.. కేబినెట్ మినిస్టర్స్ జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలో పవర్ స్టార్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు డిప్యూటీ సీఎంతో పాటు

మిగతా 2లో..

## పోలీస్ వ్యవస్థలో మార్పులకు కృషి

హత్య కేసులను రీ ఓపెన్ చేస్తాం

కక్షసాధింపు ధోరణికి టిడిపి ప్రభుత్వం దూరం

హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టీకరణ



అమరావతి,జూన్14(షణ్ముఖవెలుగు): పోలీసు వ్యవస్థలో మార్పు తీసుకు వస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. చంద్రబాబు పాలన అంటేనే శాంతిభద్రతలు పూర్తి స్థాయిలో ఉంటాయనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. అలాగే జవాబుదారీ తనం కూడా ఉంటుందని అన్నారు. గతంలో లాగా కక్షసాధింపు కార్యక్రమాలు ఉండవని అన్నారు. కొంతమంది పోలీసు అధికారులు పద్ధతి మార్చుకోవాలని వార్నింగ్ ఇచ్చారు.

మిగతా 2లో..

## పోలవరం నిర్మాణంపై చంద్రబాబు దృష్టి


ప్రతి సోమావారం పోలవరం సందర్శన

అధికారులతో సమీక్షలో స్పష్టీకరణ

అమరావతి,,జూన్14(షణ్ముఖవెలుగు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రతి సోమవారం పోలవరం ప్రాజెక్టుకు వెళ్లి.. నిర్మాణ పనులు స్వయంగా పరిశీలించాలని ఆయన

మిగతా 2లో..





## ఎపి టిడిపి కొత్త అధ్యక్షుడిగా పల్లా

చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపిన శ్రీనివాసరావు

అమరావతి,జూన్14(షణ్ముఖవెలుగు): ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావును నియమించారు. ఇప్పటి వరకు అధ్యక్షుడిగా ఉన్న అచ్చన్నాయుడు మంత్రివర్గంలో చేరడంతో పల్లాను నియమించారు. ఈ మేరకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. టీడీపీ అధ్యక్షుడిగా తనను ప్రకటించడంతో నేడు

మిగతా 2లో..

## ఆరుద్రకు చంద్రబాబు అండ

పదివేల పెన్షన్‌తో పాటు.. వైద్యఖర్చులకు 5లక్షల సాయం

అమరావతి,జూన్14(షణ్ముఖవెలుగు): కాకినాడ గ్రామీణ మండలం రాయుడుపాలెంనకు చెందిన వైకాపా బాధితురాలు ఆరుద్ర.. శుక్రవారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. దివ్యాంగురాలైన ఆమె కుమార్తెకు రూ.10వేల పింఛను మంజూరు చేస్తామని, వైద్య ఖర్చుల కోసం రూ.5 లక్షలు సాయం

మిగతా 2లో..





## మానవాళి గౌరవమర్యాదలపై ప్రధాన దృష్టి ఉండాలి

- మానవ సంబంధాలను యాంత్రికంగా మార్చేసే ప్రమాదం
- ఏఐ వంటి శక్తిమంతమైన సాంకేతికత నియంత్రనవసరం
- జీ7 దేశాలకు పోప్ ఫ్రాన్సిస్ పిలుపు
- ఉక్రెయిన్ వివాదంపై శాంతియుత పరిష్కారం
- అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ప్రధాని మోడీ
- ఇటలీలో బిజీగా ప్రధాని మోడీ
- పలు దేశాధినేతలతో వరుస భేటీలు

న్యూఢిల్లీ,జూన్14(షణ్ముఖవెలుగు): కృత్రిమ మేధ ను అభివృద్ధి చేసే, వినియోగించే క్రమంలో మానవాళి గౌరవమర్యాదలను ప్రధానంగా దృష్టిలోఉంచుకోవాలని జీ7 దేశాలకు పోప్ ఫ్రాన్సిస్ పిలుపునిచ్చారు. ఏఐ వంటి శక్తిమంతమైన సాంకేతికత.. మానవ సంబంధాలను యాంత్రికంగా మార్చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈనేపథ్యంలో ఏఐని

మిగతా 2లో..

# అంశాల వారీగా మద్దతు ఇస్తాం

రాష్ట్ర, దేశ ప్రయోజనాలే ముఖ్యం

లోక్‌సభలో నేతగామిథున్ రెడ్డి నియామకం

పార్లమెంటరీ పార్టీ నేతగా వైవి సుబ్బారెడ్డి

పార్టీ ఎంపిలకు జగన్ దిశానిర్దేశం



అమరావతి,జూన్14(షణ్ముఖవెలుగు): ప్రజాహితమే ధ్యేయంగా పార్లమెంట్‌లో నిర్ణయాలు తీసుకునేలా పోరాడాలని వైసీపీ ఎంపీలకు జగన్ సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అంశాలవారీగానే మద్దతు ఉంటుందన్నారు. ఎవరికైనాగాని, అంశాలవారీగానే మద్దతు ఉంటుందన్నారు.తాడేపల్లి పార్టీ కార్యాలయంలో జగన్ ఎంపీలతో సమావేశం అయ్యారు. పార్లమెంటులో మనకు 11 మంది రాజ్యసభ సభ్యులు, 4గురు లోక్‌సభ సభ్యులు ఉన్నారని.. మొత్తంగా 15 మంది ఎంపీలు మన పార్టీకి ఉన్నారు. టీడీపీకి 16 మంది ఉన్నారు. అందువల్ల మన పార్టీకూడా చాలా బలమైనదే. మనల్ని ఎవ్వరూ ఏమీ చేయలేరని

మిగతా 2లో..

## తితిదే ఈవోగా జె.శ్యామలరావు

2లో..

## మంచి చేసి ఓడిపోతే బాధ ఎందుకు

చెడుచేసి ఓడిపోతే బాధపడాలి

మాజీమంత్రి రోజా ఆసక్తికర ట్వీట్

తిరుపతి,జూన్14(షణ్ముఖవెలుగు): ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి రోజా తాజాగా ఓ ఆసక్తికర ట్వీట్ చేశారు. అందులో ఆమె పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వ హయాంలో మంచి చేశాం..అయినా కూడా తాము ఓడిపోయాం.. ఓడిపోయినంత మాత్రాన ఎందుకు సిగ్గుపడాలన్నారు. మనం మంచి చేసి ఓడిపోయాం..

మిగతా 2లో..



## కృష్ణా జిల్లాలో రోడ్డు ప్రమాదం

కంటెయినర్‌ను ఢీకొన్న లారీ.. ఆరుగురు దుర్మరణం

క్షతగాత్రులకు మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శ

మృతుల కుటుంబాలకు 5లక్షల చొప్పున సాయం ప్రకటన

విజయవాడ,జూన్ 14(షణ్ముఖవెలుగు): కృష్ణా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద హైవేపై లారీ, కంటైనర్ ఢీకొన్నాయి. లారీ కృష్ణా జిల్లా బంటుమిల్లి వైపు, కంటైనర్ పుదుచ్చేరి నుంచి భీమవరం వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో ఇరు వాహనాల డ్రైవర్లతో పాటు మరో నలుగురు ఉన్నారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు చనిపోగా..



మిగతా 2లో..

# పోలవరం నిర్మాణంపై చంద్రబాబు దృష్టి

మొదటిపేజీ తరువాయి..

నిర్ణయించారు. శుక్రవారం అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో అన్ని శాఖలపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆ క్రమంలో రాష్ట్రంలోని నీటి పారుదల శాఖ ప్రాజెక్టుల స్థితిగతులపై ఆరా తీశారు. పోలవరం ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితి ఎలా ఉందంటూ ఈ సందర్భంగా అధికారులను ఆయన ప్రశ్నించారు. దీంతో వారిచ్చిన సమాధానానికి ఆయన సంతృప్తి చెందలేదు. దీంతో ప్రతి సోమవారం పోలవరం ప్రాజెక్ట్ సందర్శనకు వెళ్లాలని చంద్రబాబు నిర్ణయించారు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రతి సోమవారం పోలవరం ప్రాజెక్ట నిర్మాణంపై సమీక్ష నిర్వహించేవారు. అందులోభాగంగా ఆయన పోలవరం ప్రాజెక్ట్ సైతం దర్శించేవారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అనంతరం ముఖ్యమంత్రి వైయస్ జగన్ రివర్స్ టెండరింగ్ పేరుతో కాంట్రాక్టర్‌ను మార్చారు. ఆ తర్వాత సదరు ప్రాజెక్ట్ నిర్మాణం ఎంత వరకు వచ్చింది... నిర్మాణం ఏ దశలో ఉందో చెప్పే వారే జగన్ ప్రభుత్వంలో కరువయ్యారు. ఇక తాజాగా జరిగిన ఎన్నికల్లో ఆంధ్ర ఓటరు.. కూటమికి పట్టం కట్టారు. అదీకాక.. ఎన్నికల ప్రచారంలో పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి, రాజధాని అమరావతి నిర్మాణానికి సహాయ సహకారాలందిస్తామని ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించిన సంగతి తెలిసిందే.

# మంచి చేసి ఓడిపోతే బాధ ఎందుకు

మొదటిపేజీ తరువాయి..

అలాంటప్పుడు ఎందుకు సిగ్గుపడాలి..? గౌరవంగా తలెత్తుకు తిరుగుదామంటూ ఆమె అందులో పేర్కొన్నారు. శుక్రవారం ఆమె సోషల్ మీడియా(ఎక్స్)లో ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా పలు వ్యాఖ్యలు చేస్తూ తమ నేతలకు, కార్యకర్తలకు ఉత్తేజాన్ని నింపారు. 'చెడు చేసి ఓడిపోతే సిగ్గుపడాల! కానీ.. మంచి చేసి ఓడిపోయాం! గౌరవంగా తలెత్తుకు తిరుగుదాం! ప్రజల గొంతుకై ప్రతిధ్వనిద్దాం!' అంటూ రోజా ఆ ట్వీట్ లో పేర్కొన్నారు. తన ఫొటోను షేర్ చేసి ఈ విధంగా పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ట్వీట్ తెగ వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్స్ పలు విధాలుగా కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ఇటు ఏపీ మంత్రులకు చంద్రబాబు శాఖలు కూడా కేటాయించిన విషయం తెలిసిందే. పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడినవారిని ఎట్టి పరిస్థితుల్లో వదలబోమంటూ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేసి ఉండొచ్చంటూ పలువురు చర్చిస్తున్నారు. కాగా, ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి భారీ విజయం సాధించింది. అయితే, గతంలో కంటే ఈసారి ఎక్కువ సీట్లు వస్తాయని ఆశించిన వైస్సార్ సీపీకి కేవలం 11 సీట్లు మాత్రమే వచ్చాయి. కనీసం ప్రతిపక్ష హోదా వచ్చేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. వైసీపీ తరపున నగరి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి రోజా ఓటమి పాలయ్యారు. టీడీపీ అభ్యర్థి గాలి భాను చేతిలో దారుణంగా ఓడిపోయారు. ఎన్నికల ఫలితాల తరువాత సోషల్ మీడియాలో పలు పోస్ట్ లు పెడుతూ వస్తోంది. తాజాగా కూడా ఈ ఆసక్తికరమైన పోస్ట్ చేశారు.


# ఎపి టిడిపి కొత్త అధ్యక్షుడిగా పల్లా

మొదటిపేజీ తరువాయి..

పల్లా శ్రీనివాసరావు చంద్రబాబును కలిశారు. పల్లాకు చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఇటీవల జరిగిన ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌పై భారీ మెజార్టీతో పల్లా శ్రీనివాసరావు గెలుపొందారు. రాష్ట్రంలో అత్యధికంగా 95,235 ఓట్ల తేడాతో పల్లా గెలుపొందారు. ఈ నేపథ్యంలో బీసీ-యాదవ వర్గానికి చెందిన పల్లాను చంద్రబాబు ఎంపిక చేశారు. ఇప్పటి వరకు ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా అచ్చెన్నాయుడు వ్యవహరించిన విషయం తెలిసిందే. అచ్చెన్నాయుడు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు చేపట్టడంతో టీడీపీ అధ్యక్షునిగా వేరే వారిని నియమించాలని చంద్రబాబు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు పల్లా శ్రీనివాసరావును నియమించడంతో టీడీపీ కేడర్ అభినందనలు చెబుతున్నారు.

# తితిదే ఈవోగా జె.శ్యామలరావు

అమరావతి,,జూన్14(షణ్ముఖవెలుగు): తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఈవోగా జె.శ్యామలరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఈవోగా ఉన్న ధర్మారెడ్డిని ఏపీ ప్రభుత్వం తొలగించింది. దీంతో ఆయన సెలవుపై వెళ్లిన విషయం తెలిసిందే. శ్యామలరావు ప్రస్తుతం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



# ఆరుద్రకు చంద్రబాబు అండ

మొదటిపేజీ తరువాయి..

చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఆమె ఆస్తి వివాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సాయం చేస్తుందని హామీ ఇచ్చారు. ఆరుద్ర కుమార్తె సాయిలక్ష్మీచంద్ర కొంతకాలంగా వెన్నెముక సమస్యతో బాధపడుతోంది. కుమార్తె వైద్యం కోసం ఇంటిని అమ్మేందుకు యత్నించిన ఆరుద్రను.. గత ప్రభుత్వ హయాంలో వైకాపా నేతలు అడ్డుకున్నారు. ఈ విషయంపై అనేకసార్లు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చినా.. జగన్‌ను కలవకుండా అప్పట్లో పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. న్యాయం జరగడంలేదనే బాధతో అప్పట్లో సీఎం క్యాంపు ఆఫీసు వద్దే ఆరుద్ర ఆత్మహత్యాయత్నం కూడా చేశారు. చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లగా.. కూటమి అధికారంలోకి వచ్చాక ఆదుకుంటామని ఆమెకు హామీ ఇచ్చారు.



# కృష్ణా జిల్లాలో రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

ఆస్పత్రికి తరలిస్తుండగా మరొకరు మృతిచెందారు. మృతులను కాకినాడ జిల్లా గొర్రిపూడి గ్రామానికి చెందిన గండి ధర్మవర ప్రసాద్ (27), అమలాపురానికి చెందిన పేసింగు కనకరాజు (34), కాట్రేనికోనకు చెందిన చింతా లోవరాజు (32), మాగపు సోమరాజు (30), ఎస్ యానాంకు చెందిన రేవు నాగభూషణం (26), తమిళనాడుకు చెందిన కంటైనర్ డ్రైవర్ అయ్యప్పన్ (42)గా గుర్తించారు. ప్రమాద సమయంలో కృష్ణా జిల్లా బంటుమిల్లి వైపు వెళ్తున్న లారీలో డ్రైవర్‌తో పాటు 10 మంది ప్రయాణికులున్నారు. కంటైనర్‌లో డ్రైవర్‌తో పాటు ఓ ప్రయాణికుడు ఉన్నారు. కర్రల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి ప్రమాదం జరిగినట్లు సమాచారం. చేపలు పట్టేందుకు వెళ్తూ వీరంతా ప్రమాదానికి గురైనట్లు పోలీసులు వెల్లడించారు. మృతదేహాలను మచిలీపట్నం ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నాడో లేదంటే మరో కారణమో కానీ జాతీయ రహదారిపై కంటైనర్‌ను ఢీకొట్టాడు. కృత్తివెన్ను మండలం సీతనపల్లి దగ్గర ఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రులను మచిలీపట్నం ఆస్పత్రికి తరలించారు. మృతులంతా తాళ్లరేవు వాసులుగా గుర్తించడం జరిగింది. మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో కృత్తివెన్ను రోడ్డు ప్రమాద క్షతగాత్రులను మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ముందస్తుగా రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. శుక్రవారం తెల్లవారుజామున కంటైనర్, మినీ వ్యాన్ ఢీకొని ఆరుగురు మృతి చెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా కలెక్టర్, ఎస్పీ, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావులతో కలిసి జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మృతులు ఒకొక్కరికి రూ.5లక్షలు చొప్పున మొత్తం రూ.30 లక్షలు ఎక్స్ గ్రేషియా అందిస్తామని కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఎక్స్ గ్రేషియా మొత్తాన్ని ఈ రోజు సాయంత్రం లోపు అందజేస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.



# అంశాల వారీగా మద్దతు ఇస్తాం

మొదటిపేజీ తరువాయి..

ధీమా వ్యక్తం చేసారు. మనం ధైర్యంగా ఉండి ప్రజల తరపున పోరాటం చేయాలన్నారు. 2019-24 మధ్య ప్రభుత్వం ఎప్పుడు వచ్చిందో ఎప్పుడు మన పరిపాలనాకాలం ముగిసిందో తెలియదు. ఈ సారికూడా అంతే. ఐదేళ్లు ఇట్టే గడిచి పోతాయని ఎంపీలకు ధైర్యం చెప్పారు. పార్టీ విధివిధానాల ప్రకారం ఎంపీలు ముందుకు సాగాలని సూచించారు. ప్రజలముందు తలెత్తుకునేలా పార్లమెంటులో ఎంపీలు ముందుకుసాగాలని... రాజకీయంగా ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న పరిస్థితులు తాత్కాలికమన్నారు. మన పరిపాలనను, చంద్రబాబు పరిపాలనను ప్రజలు గమనిస్తూనే ఉంటారన్నారు. ఖచ్చితంగా మనం తిరిగి ప్రజల విశ్వాసాన్ని పొందగలుగుతామనే నమ్మకం, విశ్వాసం ఉన్నాయన్నారు. ఈలోగా మనం ధైర్యాన్ని కోల్పోకూడదని సూచించారు. ఇదివరకటి లాగానే రాజ్యసభలో పార్టీ నాయకుడిగా విజయసాయిరెడ్డి కొనసాగుతారని జగన్ ప్రకటించారు. లోక్‌సభలో పార్టీ నాయకుడిగా మిథున్ రెడ్డి వ్యవహరిస్తారని.. పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా వై.వి.సుబ్బారెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తారని జగన్ స్పష్టం చేశారు. తాను అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఎంపీలంతా కలిసి కూర్చుని చర్చించుకుని ఆ మేరకు అడుగులు ముందుకేయాలనకి సూచించారు. పార్టీపరంగా వ్యవహరించాల్సిన అంశాలను పరస్పరం చర్చించుకుని, నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఎంపీలుగా మీరు వేసే ప్రతి అడుగూ పార్టీ ప్రతిష్టను పెంచేదిగా ఉండాలన్నారు. పార్టీకోసం మీరు కష్టపడండి. పార్టీ మిమ్మల్ని గుర్తుపెట్టుకుంటుందని హామీ ఇచ్చారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీసుకు వచ్చింది. దీనికి అనుగుణంగా రాష్ట్రంలోకూడా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తీసుకొచ్చినప్పుడు అసెంబ్లీ సాక్షిగా టీడీపీ మద్దతు పలికింది. కాని, సరిగ్గా ఎన్నికల సమయంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను ఒక భూతంలా చూపిటీడీపీ, కూటమి పార్టీలు విషప్రచారం చేశాయని ఆరోపించారు. వైయస్సార్సీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15 వేలమంది సర్వేయర్లను నియమించడం వల్లే సాధ్యపడే పరిస్థితులు వచ్చాయని.. భూమి కొనాలన్నా, అమ్మాలన్నా.. మోసాలకు ఎలాంటి ఆస్కారం లేని పరిస్థితులు ఈ చట్టంవల్ల వస్తాయననారు. టీడీపీ వాళ్లు మద్దతు పలికిన చట్టాన్ని ఇప్పుడు వాళ్లే తీసేస్తామంటున్నారు. వారి చేస్తున్న రాజకీయాలు ఎలా ఉంటాయో దీనిబట్టే తెలుస్తుందన్నారు. వైయస్సార్సీపీని నమ్ముకుని కొన్ని లక్షలమంది కార్యకర్తలు ఈ పార్టీపై ఆధారపడి ఉన్నారు. కొన్ని వేలమంది నాయకులు పార్టీలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో మనకు 40శాతం ఓట్లు వచ్చాయి. గడచిన ఎన్నికలతో పోలిస్తే 10 శాతం ఓట్లు తగ్గాయి. రానున్న రోజుల్లో ఈ 10శాతం ప్రజలే? మన పాలనకు, ఇప్పటి ప్రభుత్వం పాలనకు తేడాను గుర్తిస్తారనే నమ్మకం, విశ్వాసం ఉన్నాయి ప్రతి ఇంట్లో మన ప్రభుత్వం చేసిన మంచి ఉందన్నారు. నా వయసు చిన్నదే. నాలో సత్తువ ఇంకా తగ్గలేదన్నారు. 14 నెలలు పాదయాత్ర చేశాను. దేవుడుదయ వల్ల అన్నిరకాల పోరాటాలు చేసే శక్తి కూడా ఉందని ఎంపీలకు భరోసా ఇచ్చారు.



# అమోదయోగ్య శాఖల కేటాయింపు

మొదటిపేజీ తరువాయి..

అడవులు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను పవన్‌కు కేటాయించారు చంద్రబాబు. నారా లోకేష్‌కు.. గతంలో చేపట్టిన ఐటీ మంత్రిత్వశాఖతో పాటు రియల్‌టైం గవర్నెన్స్, మానవ వనరుల అభివృద్ధి పోర్ట్‌ఫోలియోలు అప్పగించారు.

హోంశాఖ విషయంలో ముందు నుంచి ప్రచారం జరుగుతున్నట్టే వంగలపూడి అనిత చేతికి వెళ్లింది. అయితే.. శాంతి భద్రతలు మాత్రం సీఎం చంద్రబాబు దగ్గరే ఉంచుకున్నారు. హోం శాఖతో పాటు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖలు అనితకు ఇచ్చారు. ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా ఎన్నికల్లో పార్టీని నడిపించిన సీనియర్ పొలిటీషియన్ అచ్చెన్నాయుడికీ కీలకమైన శాఖలు దక్కాయి. వ్యవసాయంతో పాటు సహకారం, మార్కెటింగ్, పశుసంవర్ధకం, డెయిరీ డెవలప్‌మెంట్, ఫిషరీస్ పోర్టు ఫోలియోలు ఇచ్చారు. తొలిసారి మంత్రి అయిన పయ్యావుల కేశవ్‌కు ఆర్థిక శాఖ అప్పగించారు. అసెంబ్లీ వ్యవహారాలు కూడా ఈయన చేతికే వచ్చాయి. వీటితో పాటు ప్లానింగ్, కమర్షియల్ ట్యాక్సెస్ పోర్ట్‌ఫోలియోలను కేశవ్‌కు ఇచ్చారు. ఇక కొల్లు రవీంద్రకు ఎక్సైజ్ శాఖ, గనుల పోర్ట్‌ఫోలియో దక్కింది. మరో కీలకమైన ఇంధన వనరుల శాఖను గొట్టిపాటి రవికి ఇచ్చారు. పొంగూరు నారాయణకు పట్టణ పరిపాలన, అర్బన్ డెవలప్‌మెంట్‌ను అప్పగించారు చంద్రబాబు నాయుడు. నిమ్మల రామానాయుడుకు జలవనరుల అభివృద్ధి శాఖను కేటాయించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తిచేస్తామని చెప్తున్న నేపథ్యంలో ఆ బాధ్యతలు నిమ్మలకు అప్పగించినట్టయింది. బీజేపీ నుంచి పోటీ చేసి గెలిచిన సత్యకుమార్ కు ఆరోగ్యం, కుటుంబ సక్షేమం, వైద్య విద్య శాఖలను అప్పగించారు. నాదెండ్ల మనోహర్ కు ఆహార, పౌరసరఫరాల శాఖతోపాటు వినియోగదారుల వ్యవహారాలు శాఖల్ని కేటాయించారు. ఎన్ఎండీ ఫరూక్ కు లా అండ్ జస్టిస్, మైనారిటీ సంక్షేమ శాఖల్ని అప్పగించారు. ఎ. రామనారాయణరెడ్డికి దేవాదాయ శాఖ ఇచ్చారు. కొలుసు పార్థసారథికి గృహ, సమాచార-పౌరసంబంధాల శాఖల్ని అప్పగించారు. అనగాని సత్యప్రసాద్ కు రెవెన్యూ, స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ పోర్ట్‌ఫోలియోలను ఇచ్చారు. బాలవీరాంజనేయస్వామికి సాంఘిక సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం, సంక్షేమం, సచివాలయం అండ్ విలేజ్ వాలంటీర్ శాఖలు ఇచ్చారు. గొట్టిపాటి రవికి విద్యుత్ శాఖను అప్పగించారు. కందుల దుర్గేష్ కు పర్యాటక, సాంస్కృతిక అండ్ సినిమాటోగ్రఫీ శాఖలు, జి. సంధ్యారాణికి మహిళా అండ్ శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖలు కేటాయించారు. బీసీ జనార్ధన్ రెడ్డికి రోడ్లు అండ్ భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖలను, టీజీ భరత్ కు పరిశ్రమలు అండ్ వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖలను కేటాయించారు. ఎస్. సవితకు బీసీ సంక్షేమం, వెనుకబడిన ఆర్థిక వర్గాల సంక్షేమం, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్ టైల్స్, వాసంశెట్టి సుభాష్ కు కార్మిక, కర్మాగాల బాయిలర్స్ అండ్ వైద్య బీమా సేవలు శాఖల్ని ఇచ్చారు. కొండపల్లి శ్రీనివాస్ కు ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత అండ్ సంబంధాలు, ఎం రాం ప్రసాద్ రెడ్డికి రవాణా, యువజన అండ్ స్పోర్ట్స్ శాఖల్ని అప్పగించారు.

నారా చంద్రబాబు : ముఖ్యమంత్రి, లా అండ్ ఆర్డర్
పవన్ కల్యాణ్ : డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు
నారా లోకేష్ : మానవ వనరులు అభివృద్ధి, ఐటీ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖలు
అచ్చెన్నాయుడు : వ్యవసాయశాఖ
నాదెండ్ల మనోహర్ : ఆహారం, పౌరసరఫరాల శాఖ
వంగలపూడి అనిత : హోం మంత్రిత్వ శాఖ
పొంగూరు నారాయణ : పురపాలకశాఖ, పట్టణాభివృద్ధి
సత్యకుమార్ యాదవ్ : ఆరోగ్యశాఖ
నిమ్మల రామానాయుడు : నీటిపారుదల శాఖ
మహ్మద్ ఫరూఖ్ : న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమం
ఆనం రామనారాయణరెడ్డి : దేవాదాయ శాఖ
పయ్యావుల కేశవ్ : ఆర్థిక శాఖ
అనగాని సత్యప్రసాద్ : రెవెన్యూ శాఖ
కొలుసు పార్థసారథి: హౌసింగ్,
డోలా బాలవీరాంజనేయస్వామి: సాంఘిక సంక్షేమ శాఖ
గొట్టిపాటి రవికుమార్ : విద్యుత్ శాఖ
కందుల దుర్గేష్ : పర్యాటకం, సాంస్కృతిక శాఖలు
గుమ్మడి సంధ్యారాణి : స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖలు
బీసీ జనార్ధన్ : రహదారులు, భవనాల శాఖలు
టీజీ భరత్: పరిశ్రమల శాఖ
ఎస్.సవిత : బీసీ సంక్షేమం, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖలు
వాసంశెట్టి సుభాష్ : కార్మిక, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్
కొండపల్లి శ్రీనివాస్ : చిన్నతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ ఎంపర్‌మెంట్ శాఖలు
మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి: రవాణా, యువజన, క్రీడా శాఖలు

# పోలీస్ వ్యవస్థలో మార్పులకు కృషి




మొదటిపేజీ తరువాయి..

మార్పు లేకపోతే తామే మార్పుస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఉండబోవు, వారు స్వేచ్ఛగా తిరగవచ్చని అన్నారు. హోంమంత్రిగా తనను నియమించడంపై అనిత మాట్లాడుతూ... మాచర్లలో చంద్రయ్య వంటి హత్య కేసులను రీ ఓపెన్ చేస్తాం, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ అంశంపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారని అన్నారు. తెలుగుదేశం కార్యకర్తలు, నేతలు, గత ఐదేళ్లలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అక్రమ కేసులు అన్నింటిపై కూడా సమీక్ష తప్పని సరిగా ఉంటుందని స్పష్టం చేశారు. చివరకు చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని కూడా శాసనసభ వేదికగా కించపరిచారని మండిపడ్డారు. చంద్రబాబు ఈ సంఘటనతో కన్నీటి పర్యంతమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కన్నీటితో రాష్ట్రంలో రాజకీయంగా ఉప్పెన వచ్చిందన్నారు. అందుకే ప్రజలు ఇలాంటి ఫలితాన్ని ఇచ్చారని చెప్పుకొచ్చారు. చంద్రబాబు పాలన రావాలని, శాంతిభద్రతలు బాగుండాలనే కోరుకునే ఆయనకు పట్టం కట్టారని అన్నారు. విశాఖలో డాక్టర్ సుధాకర్‌ను ఏ విధంగా హత్య చేశారో చూశామన్నారు. విశాఖలో వారి కుటుంబ సభ్యులను కూడా వెళ్లి కలుస్తానని చెప్పారు. టీడీపీ కార్యకర్తలు, నేతలు, మహిళలు, సామాన్య ప్రజలు ఎవరూ కూడా ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు.

# పవన్ కల్యాణ్.. డిప్యూటీ సీఎం

మొదటిపేజీ తరువాయి..



పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను కేటాయించారు. వాస్తవానికి పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అనే విషయాన్ని చంద్రబాబు ప్రకటించక ముందే కేంద్ర మంత్రి అమిత్ షా, మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా ఎక్స్ ద్వారా ప్రకటించారు. డిప్యూటీ సీఎంతో పాటు హోమ్ మినిస్టర్ కూడా పవన్ కళ్యాణెళి అనేలా సోషల్ మీడియాలో భారీ స్థాయిలో ప్రచారం జరిగినా.. ఫైనల్‌గా పవన్ కళ్యాణ్‌కు పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రిగా నియమిస్తూ అధికారికంగా విడుదల చేసిన జాబితాలో ప్రకటించారు. పవన్ కళ్యాణ్‌కు కూడా ఈ శాఖలపై ఆసక్తి ఉన్నట్లుగా కూడా వార్తలు వైరల్ అయ్యాయి. ఇక ఈ ప్రకటనతో ఫ్యాన్స్, జనసేన కార్యకర్తలు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# మానవాళి గౌరవమర్యాదలపై ప్రధాన దృష్టి ఉండాలి

మొదటిపేజీ తరువాయి..

సద్వినియోగం చేసుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. చాట్‌జీపీటీ వంటి రూపాల్లో కృత్రిమ మేధ కొత్త పుంతలు తొక్కుతున్న వేళ.. దాని ప్రయోజనాలు, పొంచిఉన్న ముప్పుల గురించి మాట్లాడిన ఆయన.. జీ7 శిఖరాగ్ర సదస్సు ( ను ఉద్దేశించి ప్రసంగించిన తొలి పోప్‌గా చరిత్రకెక్కారు. "మానవజాతికి సంబంధించిన నిర్ణయాలు యంత్రాలు కాకుండా.. ఎల్లప్పుడూ మనుషులే తీసుకునేలా ఏఐని కట్టడి చేయడంలో నేతలు చొరవ చూపాలి. ఏఐ నిర్ణయాలపై మనుషుల




నియంత్రణ అవసరం. కృత్రిమ మేధకు పగ్గాలు వేసేందుకు ముందుకొస్తున్న దేశాలు, అంతర్జాతీయ సంస్థలతో చేతులు కలిపేందుకు ఈ సదస్సును ఒక అవకాశంగా తీసుకోవాలి" అని పోప్ పేర్కొన్నారు. ఈసందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా దేశ, విదేశీ నేతలను పోప్ పలకరించారు. అంతకుముందు ఆయన.. వాటికన్ సిటీలో 100 మందికిపైగా హాస్యనటులకు ఆతిథ్యం ఇచ్చారు. కనీసం ఒకరి పెదవులపై చిరునవ్వును తీసుకొచ్చినా.. ఆ భగవంతుడినీ నవ్వించినట్లేనని చెప్పారు. ఉక్రెయిన్ వివాదానికి శాంతియుత పరిష్కార మార్గానికి భారత్ తన శక్తి మేరకు అన్ని విధాలా ప్రయత్నిస్తుందని ప్రధాని మోడీ అన్నారు. శాంతికి 'సంభాషణ , దౌత్యం' మాత్రమే మార్గమని శుక్రవారం ఉక్రేనియన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్ స్కీ కి ప్రధాని నరేంద్ర మోడీ తెలియజేశారు. ఇటలీలోని అపులియా ప్రాంతంలో జి-7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మోడీ, జెలెన్స్కీని కలిశారు. భారతదేశం మానవ-కేంద్రీకృత విధానాన్ని విశ్వసిస్తుందని కూడా ప్రధాన మంత్రి జెలెన్స్కీకి చెప్పారు. ఉక్రెయిన్‌లో పరిస్థితి, స్విట్జర్లాండ్‌లో జరగనున్న శాంతి సదస్సుపై ఇరువురు నేతలు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి విదేశీ పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్రమోదీ వరుస సమావేశాలతో బీజీగా ఉన్నారు. ఇటలీ వేదికగా జరుగుతోన్న జీ7 దేశాల సదస్సులో భారత్ ఆహ్వానిత దేశంగా పాల్గొంది. ఈసందర్భంగా జీ7 దేశాల అధినేతలతో ఆయన వరుస ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొంటున్నారు. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో సంభాషించారు. అలాగే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, మోదీ మధ్య కూడా భేటీ జరిగింది. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం విషయంలో పశ్చిమదేశాల ఒత్తిడిని అధిగమించి, భారత్ స్వతంత్ర వైఖరిని ప్రదర్శించింది. చర్చలు, దౌత్యమార్గాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచిస్తూనే.. రష్యా వ్యతిరేకంగా ఐరాసలో జరిగిన ఓటింగ్‌కు పలుమార్లు దూరంగా ఉంది. ఇదిలాఉంటే.. ప్రస్తుత సమావేశంలో పుతిన్ సేనలతో జరుగుతోన్న ఘర్షణకు సంబంధించి పలు అంశాలను మోదీకి జెలెన్ స్కీ వివరించినట్లు సమాచారం. ఇక ఈ జీ7 సదస్సులో ఈ యుద్ధం గురించే చర్చ జరిగింది. ఫ్రీజ్ చేసిన రష్యన్ ఆస్తుల్ని ఉపయోగించి ఉక్రెయిన్‌కు 50 బిలియన్ల డాలర్ల రుణం ఇచ్చేందుకు అమెరికా ప్రతిపాదన చేసింది. దీనికి సభ్యదేశాలు తమ అంగీకారం తెలిపాయి. రక్షణ, అంతరిక్ష, విద్య, డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా మోదీ , మేక్రాన్ చర్చలు జరిపారు. దాంతోపాటు పలు కీలక విషయాలపై తమ మధ్య చర్చ జరిగినట్లు మోదీ వెల్లడించారు.

# ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాల్సిందే

మొదటిపేజీ తరువాయి..

ఆర్థికమంత్రి పయ్యావులు కేశవ్ అన్నారు. ఇందుకోసం అధినేత చంద్రబాబుతో కలసి నడుస్తానని అన్నారు. ఇకపోతే రాష్ట్ర ఖజానా ఎంత ఉందో తాము ఇంకా చూడాల్సి ఉందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నిధుల మళ్లింపు, భవిష్యత్ ఆదాయం తాకట్టు వంటి అనేక అవకతవకలు జరిగాయని పయ్యావుల కేశవ్ అన్నారు. కాగ్ కూడా ఈ మేరకు నివేదిక ఇచ్చిందని, సంక్షేమానికి సమపాళ్లలో ప్రాధాన్యత ఇస్తామని ఆయన పేర్కొన్నారు. సంపద సృష్టి పేరుతో పన్నులు వేసేది లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు బ్రాండ్‌తో పరిశ్రమలు, ఐటీ కంపెనీలను ఏపీకి తీసుకువస్తామని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఇకపోతే ఏపీలో తప్పనిసరిగా ప్రతిపక్షం ఉండాలని కోరుకుంటున్నట్టు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఎందుకంటే వైఎస్సార్సీపీ అధినేత జగన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి ప్రజల తరపున మాట్లాడాలని తాను కోరుకుంటున్నట్టు వ్యాఖ్యానించారు. శాసనసభకు జగన్ రావాలని కోరుకుంటున్నానని, గతంలో చంద్రబాబు మొదటిసారి సీఎం అయినప్పుడు నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న దివంగత నేత పీజేఆర్‌ను ఇంటికి వెళ్లి కలిశారని మంత్రి గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షం ఉండాలని ఆవశ్యకత ఉందని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు ఒత్తిడిలో ఉన్నప్పుడే ఆయనలో నిజమైన స్ఫూర్తి బయటకు వస్తుందని కేశవ్ అన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్షం మొత్తాన్ని సస్పెండ్ చేసి చంద్రబాబు ఒక్కరినే అసెంబ్లీలో ఉంచారని ఆయన గుర్తుచేశారు. అప్పుడే చంద్రబాబులో ఉన్న ఫైటింగ్ స్పిరిట్ బయటకు వచ్చిందని చెప్పుకొచ్చారు.



షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 15.06.24
శనివారం

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# జంప్ జిలానీలు..?

## ఒంగోలు ఓఎంసి నుంచి ప్రారంభం కానున్న వలసలు
## జిల్లా మొత్తం వ్యాపించనున్న వైనం



**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జూన్ 14)**

సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం వైసీపీను కోలుకోలేనంతగా దెబ్బతీస్తోంది. ఆ పార్టీ నేతలు, శ్రేణుల్లోని లుకలుకలు తారస్థాయికి చేరుతున్నాయి. కొందరైతే ఏకంగా కండువా మార్చేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే ఒంగోలు నగరపాలక సంస్థ రాజకీయ ముఖచిత్రం మారబోతుందా అనే విషయం కూడా చర్చనీయాంశంగా మారింది.

కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉండగా ఎన్నికల్లో 43 స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు కార్పొరేటర్లుగా గెలుపొందారు. మేయర్‌గా గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్లుగా వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు ప్రస్తుతం వ్యవహరిస్తున్నారు. టిడిపి తరపున ఆరుగురు, జనసేన నుంచి ఒకరు కార్పొరేటర్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

**ఎన్నికలకు ముందే పెరిగిన బలం..**

సార్వత్రిక ఎన్నికలకు ముందే వైసీపీకి చెందిన అయిదుగురు కార్పొరేటర్లు టిడిపిలో చేరారు. దీంతో ప్రతిపక్షం బలం పన్నెండుకు చేరింది. సగం మంది పైగా ఉంటే అవిశ్వాసం పెట్టి ప్రస్తుతం పదవుల్లో ఉన్నవారిని తొలగించవచ్చు. అయితే 2008లో వచ్చిన చట్ట సవరణ ప్రకారం మొత్తం అయిదేళ్ల పదవీ కాలంలో నాలుగేళ్లు నిండాక అవిశ్వాసం పెట్టడానికి అవకాశం కల్పించారు. అధికారంలోకి వచ్చిన టిడిపికి ఇది సాంకేతిక సమస్యగా మారింది. పదవుల్లో ఉన్న వారు స్వచ్ఛందంగా రాజీనామాలు సమర్పిస్తే మాత్రం వారి స్థానంలో కొత్త వారిని ఎన్నుకునే అవకాశం ఉంది. నగరపాలక సంస్థ మేయర్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ అయ్యింది. కొత్త వారిని ఎన్నుకోవాల్సి వస్తే అదే కేటగిరీలో వారిని ఎన్నుకోక తప్పదు. కార్పొరేషన్‌లో ముగ్గురు ఎస్సీ మహిళలు కార్పొరేటర్లుగా ఉన్నారు. ఆ ముగ్గురు కూడా వైసీపీకి చెందిన వారే.

**రహస్య మంతనాలు షురూ..**

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు కొందరు కండువాలు మార్చేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే టిడిపి నాయకులతో రహస్య మంతనాలు సాగిస్తున్నారు. ఇప్పటికే ఎస్సీ మహిళా కార్పొరేటర్ ఒకరు తాను పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్నానని తేల్చి చెప్పినట్లు సమాచారం. అదే తరహాలో మరికొందరు టిడిపి కండువా కప్పుకోవడానికి ఆసక్తి చూపుతున్నారనే ప్రచారం సాగుతోంది. దీని పై ఎమ్మెల్యేగా ఎన్నికైన దామచర్ల జనార్దన్ నుంచి సానుకూల సంకేతాలు ఇంకా రాలేదని తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో టిడిపి కార్పొరేషన్ పై ఆధిపత్యం సాధించుకోడానికి రెండు మార్గాలున్నాయని రాజకీయవర్గాలు చర్చించుకుంటున్నాయి. పదవుల్లో ఉన్నవారు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తే తమకు అనుకూలమైన వారిని మేయర్, డిప్యూటీల పదవుల్లో నియమించుకునే అవకాశం ఒకటి. సగానికి



పైగా సభ్యులు పార్టీ మారితే కౌన్సిల్‌లో చేసిన తీర్మానాలు ఆమోదం కాకుండా నిలువరించవచ్చు. అప్పుడు పార్టీ మారిన సభ్యులు స్వతంత్రులుగా వ్యవహరిస్తారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చట్టంలో మార్పు చేశారు. మూడు నుంచి నాలుగేళ్లలోపు ఎప్పుడైనా అవిశ్వాసం పెట్టడానికి వెసులుబాటు కల్పించారు. రాష్ట్రంలోనూ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం అలాంటి నిర్ణయం తీసుకుంటే వైసీపీ చేతిలో నుంచి పగ్గాలు మారే అవకాశం ఉంటుందని కార్పొరేషన్‌లో సీనియర్ అధికారులు చెబుతున్నారు.

**ఇతర పదవుల పైనా చర్చ..**

ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఓటమిపాలైనందున ఆయన వల్ల సంక్రమించిన పదవులకు పలువురు రాజీనామాలు చేస్తారనే ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. నాలుగేళ్ల వరకు కొనసాగే అవకాశం ఉన్నందున పదవులు వదులుకుంటారా లేదా అనే చర్చా మరోవైపు వినిపిస్తోంది. రానున్న వారం రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మార్పు జరిగితే టిడిపి సభ్యుల్లో ఒక సీనియర్ కార్పొరేటర్‌కు, బీసీ కార్పొరేటర్లలో ఒకరికి లేదా కూటమిలో భాగస్వాములైన జనసేన పార్టీ కార్పొరేటర్‌కు డిప్యూటీలుగా అవకాశం రావచ్చనే చర్చ ముమ్మరంగా సాగుతోంది.

# డయాలసిస్ సెంటర్‌లో ఆయుర్వేద డాక్టరా?



## వైద్యులను ప్రశ్నించిన ఎమ్మెల్యే ఉగ్ర

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 14)**

కిడ్నీ వ్యాధిగ్రస్తుల డయాలసిస్ సెంటర్‌లో ఆయుర్వేద వైద్యుడు విధులు నిర్వర్తించడం పై ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కనిగిరి ఏరియా వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డయాలసిస్ సెంటర్‌లో కిడ్నీ రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించనన్నారు. గతంలో లాగా వైద్య సేవలు ఉంటే ఉపేక్షించేది లేదన్నారు. విధుల విషయంలో డాక్టర్లు నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలోని జనరేటర్‌ను పరిశీలించారు. కార్పొరేట్ వైద్యం ప్రభుత్వాసుపత్రిలో (తరువాయి 4లో...)

# స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి

## జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 14)**

ఆరోగ్యవంతులందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్లోని స్పందన హాలులో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో కలెక్టరేట్, మున్సిపల్ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, మెడికల్ షాపుల సిబ్బంది, బ్యాంకు ఉద్యోగులు వందమందికి పైగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వారికి ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారికి మనం ప్రాణం పోసిన వారమవుతామన్నారు. ఈ దిశగా ప్రజలకు చైతన్యం కల్పించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి (తరువాయి 4లో...)



# ఫీజుల పట్టిక ఏర్పాటు చేయని ప్రైవేటు పాఠశాలలు

**ప్రైవేట్ పాఠశాలల వైపు కన్నెత్తి చూడని విద్యాశాఖ అధికారులు**

**అధిక ఫీజుల బరువు కింద నలిగిపోతున్న పేద విద్యార్థుల తల్లిదండ్రులు**

**లక్షలు గడిస్తున్న ప్రైవేటు పాఠశాల యాజమానులు**

**(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జూన్ 14)**

త్రిపురాంతకం మండలంలో ప్రైవేటు పాఠశాల ఫీజుల దోపిడీపై నియంత్రించాల్సిన ఆ శాఖ అధికారులు చోద్యం చూడటంపై పలు విమర్శలకు తావిస్తోంది. మండలంలో పలు ప్రైవేటు పాఠశాలల్లో 9, 10వ తరగతి విద్యార్థులకు 50 వేల నుంచి 60 వేల వరకు వసూలు చేస్తున్నట్లు మండలంలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు చర్చించుకోవడం గమనార్హం. దీని పై ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రైవేటు పాఠశాలలపై దృష్టి సారించి ప్రతి ప్రైవేటు పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఏ తరగతికి ఎంత ఫీజు వసూలు చేయాలో రాష్ట్ర ప్రభుత్వ జీవో నిబంధనల ప్రకారం ఫీజుల పట్టిక ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేయాలి. ఆఫీసులో ఫీజుల పట్టిక ఏర్పాటు చేసిన అక్రమ ఫీజులు చెల్లించకుండా విద్యార్థులు చదువుకునే విధంగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పేద విద్యార్థుల తల్లిదండ్రుల ఫీజుల బరువును నియంత్రించి వారికి తోడ్పడేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.



# ఆగస్టు మూడో తేదీ వరకు ప్రత్యేక లోక్ అదాలత్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 14)**

సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం జూలై 29వ తేదీ నుంచి ఆగస్టు మూడో తేదీ వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.భారతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని కక్ష దారులు ఇరువురు సద్వినియోగపరచుకోవాలని ఇరు వర్గాల ఆమోదంతోనే కేసులు పరిష్కరించబడతాయని అన్నారు. అదేవిధంగా నోటీసులు అందుకున్న కక్షిదారులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఒంగోలు ను సంప్రదించగలరు అని తెలియజేశారు.

## మున్సిపల్‌శాఖ మంత్రిగా పొంగూరు నారాయణ

**త్వరలో నెరవేరనున్న నెల్లూరు ప్రజల చిరకాల కోరిక**

**ఆనందోత్సవాల్లో నగర ప్రజలు, టీడీపీ శ్రేణులు**



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 14)**

2024 సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు సిటీ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా డాక్టర్ పొంగూరు నారాయణ భారీ విజయాన్ని కైవసం చేసుకున్న విషయం విధితమే. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేబినెట్‌లోని మంత్రి వర్గంలో నారాయణకి స్థానం దక్కింది. పొంగూరు నారాయణకు మున్సిపల్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. మున్సిపల్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ మంత్రిగా డాక్టర్ పొంగూరు నారాయణ ను నియమించడం పట్ల జిల్లాలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.. నెల్లూరు నగర ప్రజలు, టీడీపీ శ్రేణులు కంగ్రాట్స్ నారాయణ సార్ అంటూ..తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. నారాయణకు మున్సిపల్ శాఖామంత్రిగా నియమించడంతో నెల్లూరు ప్రజల చిరకాల కోరిక అయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రక్షిత తాగునీరు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా నెల్లూరు నగరం స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోనుంది.

## గోవులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

**డీఎస్పీ బాలసుందర్రావు**




**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 14)**

ఈ నెల 17న జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను వధించరాదని, గో చట్టాన్ని ఎదిరించి గోవులను వధించిన, అక్రమ రవాణా చేసిన అట్టి వారిపై గో చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకాశం జిల్లా మార్కాపురం డీఎస్పీ బాలసుందర్రావు హెచ్చరించారు. డివిజన్ స్థాయిలో కొమరోలు, గిద్దలూరు, పుల్లలచెరువు, దోర్నాల, పలుచోట్ల చెక్పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. చట్టరీత్యా కాకుండా అక్రమంగా తరలిస్తున్న గోవులను పట్టుకునేందుకు చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. డివిజన్ స్థాయిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పండుగను ప్రశాంతమైన వాతావరణంలో సుఖ సంతోషాలతో నడుపుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆవుల వెంకటేశ్వర్లు ఉన్నారు.

## దామచర్లకు శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగ సంఘ నాయకులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 14)**

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ని ప్రకాశం జిల్లా రెవిన్యూ అసోసియేషన్ అధ్యక్షులు, ఏపీజేఏసీ అమరావతి ఛైర్మెన్ , జిల్లా ఏపీజేఏసి మహిళా వింగ్, వీఆర్వో, వీఆర్ఏ సంఘం, జిల్లా నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమములో జిల్లా అధ్యక్షులు ఆర్వీఎస్ కృష్ణమోహన్, కలెక్టరేట్ అధ్యక్షులు వూతకోలు శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి దానియేలు, కాశీ, రామనారాయణ రెడ్డి, డేవిడ్, సీహెచ్ కృష్ణమోహన్, ప్రశాంత్, మహిళవిభాగం అధ్యక్షులు జయలక్ష్మి, సెక్రటరీ శ్రీదేవి, కోమటిగుంట వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి



రక్తదానం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా జిల్లాలో బ్లడ్ బ్యాంకును కూడా ఆధునీకరిస్తామని చెప్పారు. రక్తదానం చేసిన వారిలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీకాంత్, ఇతర ఉద్యోగులు ఉన్నారు. రక్తదానం చేసిన డిఆర్ఓ ఆర్ శ్రీలత కుమారుడు యశ్వంత్‌ను జాయింట్ కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓతో పాటు డిఎంహెచ్ఓ సురేష్ కుమార్, రెడ్ క్రాస్ చైర్మన్ ప్రకాష్ బాబు, వైస్ చైర్మన్ వెంకటేశ్వరెడ్డి, ట్రెజరర్ రాఘవయ్య, బ్లడ్ బ్యాంకు కన్వీనర్ మంగళగిరి నరసింహారావు, దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

## డయాలసిస్ సెంటర్‌లో ఆయుర్వేద డాక్టరా?

అందించాల్సి ఉందన్నారు. మత్తు డాక్టర్‌తో పాటు ప్రధాన విభాగాల వైద్యులను నియమించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యశాలలో మౌలిక వసతుల కల్పన పై చర్యలు చేపడతామన్నారు. డాక్టర్లు కనిగిరి ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించకపోతే సహించేది లేదన్నారు.



## ప్రవేట్ స్కూల్ బస్సులపై కొరడా

**పొదిలిలో పలు పాఠశాలల వాహనాలపై కేసులు నమోదు**

**రూ.90 వేలు జరిమాన**

**దర్శి రవాణా శాఖ అధికారి రవికుమార్**




**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 14)**

పొదిలి పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల బస్సులను శుక్రవారం దర్శి రవాణాశాఖ అధికారి రవికుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఫిట్నెస్ లేకుండా, టాక్స్ కట్టకుండా తిరుగుతున్న పలు స్కూల్ బస్సుల పై కేసులు నమోదు చేసి రూ.90 వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. సరైన పత్రాలు లేని స్కూల్ బస్సులు, ఇతర వాహనాలపై కేసులు నమోదు చేసే పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు. అలా కాదని ప్రభుత్వ నియమ నిబంధనలకు రుద్ధంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకొని జరిమానా విధించడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## అర్ధవీడులో టిడిపి నాయకుల సంబరాలు

**(షణ్ముఖ వెలుగు, అర్ధవీడు, జూన్ 14)**

తెలుగుదేశం పార్టీ, ఎన్డీఏ కూటమి అఖండ విజయంతో నాలుగోసారి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా గిద్దలూరు ఎమ్మెల్యేగా ముత్తుముల అశోక్‌రెడ్డి గెలిచిన సందర్భంగా మండలంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రమాణ స్వీకార సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టిడిపి, బిజెపి నాయకులు పాల్గొని కేక్ కటింగ్, బాణాసంచా నిర్వహించారు. మిఠాయిలు పంచుతూ అర్ధవీడు సెంటర్లలో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు తెలుగుదేశం, బిజెపి, జనసేన అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను కలిసిన తహాశీల్దార్



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జూన్ 14)**

కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని హనుమంతునిపాడు మండల తాసిల్దార్ కొంగలవీటి కిషోర్ కుమార్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా నాగరాజు జన్మదిన వేడుకలు



**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జూన్ 14)**

రాష్ట్ర టీయన్ యస్ ఫ్ కార్యనిర్వహక కార్యదర్శి నాగరాజు జన్మదిన వేడుకలు యర్రగొండపాలెం టీడీపీ పార్టీ ఆఫిస్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యర్రగొండపాలెం నియోజకవర్గ సమన్వయకర్త గూడూరి ఏరీక్షణ్ బాబు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పుల్లల చెరువు మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు నాగరాజునీ సత్కరించారు. నియోజక వర్గ నాయకులు కేక్ కట్ చేసి తినిపించారు. పుల్లల చెరువు మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్,పలువురు నాయకులు నాగరాజుకు కేక్ తినిపించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ సమన్వయ కర్త గూడూరి ఏరీక్షణ్ బాబు,పయ్యావుల ప్రసాద్, కాకర్ల కోటయ్య, పల్లపాటి బాదరయ్య,అనిల్, విరాంజీ , యర్రయ్య, మాజీ ఎంపీటీసీ ఇదెమ్మ పాల్గొన్నారు.

## పాస్‌పోర్టు పోయినది

ప్రకాశం జిల్లా పొదిలి మండలం పొదిలి గ్రామానికి చెందిన షేక్ ఖాదర్ భాష తండ్రి షేక్ ఎ కె జిలానికి చెందిన పాస్ పోర్టు జిరాక్సు తీయించుకునేందుకు ఇంటి నుంచి జిరాక్సు షాపుకు వెళ్ళే సమయంలో మార్గ మధ్యంలో 10/05/2024న ఎక్కడో పడిపోయినది. షేక్ ఖాదర్ భాష ు 3494544 నెంబరు గల పాస్ పోర్టు దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు
షేక్ ఖాదర్ భాష
తండ్రి ఎస్ కె ఎ కె జిలాని,
పొదిలి గ్రామం, పడమటి పాలెం,
డోర్ నెం. 06/51, పొదిలి మండలం,
ప్రకాశం జిల్లా.
సెల్ నెం. 9959132767
(ఆధార్ నెం. 7469 9774 1045)

# దుర్గమ్మ సేవలో మంత్రి ఆనం





(షణ్ముఖ వెలుగు, నెలూరు, జూన్ 14)

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్నారు వారికి వేదపండితులు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించిన తరువాత వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈఓ రామారావు అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. వీరితోపాటు కొండ్రెడ్డి రితీష్ రెడ్డి, ఆనం కైవల్య రెడ్డి, తాళ్లూరి గిరి నాయుడు, కాటంరెడ్డి రవీంద్ర రెడ్డి, దేవకుమార్ రెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దామచర్లకు అభినందనలు



(షణ్ముక వెలుగు, ఒంగోలు, జూన్ 14)

డీమార్ట్ ఆటో స్టాండ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన దామచర్ల జనార్ధన్‌ను ఒంగోలు టిడిపి కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆటో ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్ ను కలిసిన వారిలో ప్రెసిడెంట్ మనోహర్, సెక్రెటరీ ఎద్దు రమేష్, ఇమ్మానుయేలు, మస్తాన్, రాజేష్, నరసయ్య, ప్రకాష్, వెంకట్రావు, చెప్పు గురవయ్య, సీహెచ్ గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో డబల్ ఇంజన్ పాలన మొదలైంది

## ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇన్‌ఛార్జి, జూన్ 14)

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టడంతో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పాలన మొదలైందని సూళ్లూరుపేట శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల్లో భాగంగా 5 సంక్షేమ పథకాల ఫైళ్ళపై ఆయన సంతకాలు చేయడంతో సంక్షేమం మొదలైందని తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలను అమలు చేసి జనం మెచ్చే పాలన సాగిస్తారనిఅన్నారు. రాష్ట్ర పాలనలో తనకు భాగస్వామ్యం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, నియోజకవర్గ టిడిపి నాయకులు, అత్యధిక మెజారిటీ అందించి ఎమ్మెల్యేని చేసిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడి ఎన్డీఏ కూటమికి 164 స్థానాలతో భారీ విజయాన్ని అందించినరాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనం భేటీ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతుందన్నారు. ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు వైసీపీ చేస్తున్న కవ్వింపు చర్యలను పట్టించుకోవద్దన్నారు. కక్ష సాధింపు కూటమి నాయకులకు లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించే దిశగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు వేలూరు మురళీకృష్ణరెడ్డి, నాయుడుపేట మండల పార్టీ అధ్యక్షులు కే అశోక్ కుమార్ రెడ్డి, సూళ్లూరుపేట పట్టణ పార్టీ అధ్యక్షులు ఆకుతోట రమేష్, సూళ్లూరుపేట రూరల్ అధ్యక్షులు శంకరయ్య యాదవ్, దొరవారి సత్రం మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివసులు నాయుడు, ఓజిలి మండల పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు, పెళ్లకూరు మండల పార్టీ అధ్యక్షులు కృష్ణయ్య యాదవ్,మధు నాయుడు, మొండెం బాబు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు అవధానం సుధీర్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పసల గంగా ప్రసాద్, సర్పంచ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగేంద్రరెడ్డి, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి నానాబాల సుబ్బారావు, నాయకులు కాపులూరు చక్రపాణి, బల్లి ముత్యాలయ్య, వెంకటేశ్వర్లు యాదవ్, గోను బాబు, తదిదరులు పాల్గొన్నారు.

# ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుతో రైతులకు ఊరట

## అడ్వకేట్ తాళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 14)

ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దుతో రైతులు, భూ యజమానులకు ఊరట కలుగనుందని చేజర్ల మండలం నూతక్కవారికండ్రిక గ్రామానికి చెందిన ప్రముఖ అడ్వకేట్ తాళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ ఎంతటి దుర్మార్గంగా ఉంటుందో..జగన్ తీసుకున్న నిర్ణయం వల్ల భూయజమానులు, రైతులకు వాటిల్లే నష్టాన్ని సమగ్రంగా ఎన్నికల ప్రచారంలో నేతలు వివరించి సక్సెస్ అయ్యారని అన్నారు. తాము సంపాదించుకున్న భూములపై జగన్ పెత్తనమేంటన్నది భూ యజమానులందరూ గ్రహించి జగన్ నిర్ణయాన్ని వ్యతిరేకించారని తెలిపారు. అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని చెప్పిన చంద్రబాబు.. ఇచ్చిన మాట నిలబెట్టుకునే దిశగా సంతకం చేయడంతో.. రైతులు. భూయజమానుల ఆనందాలకు అవధుల్లేవని ఈ సందర్భంగా అడ్వకేట్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.

# అత్యధిక జనాభా ఉన్న మాల, మాదిగలకు చెరొక మంత్రి పదవా?

## జగన్ ఇచ్చినట్టే ఎస్సీలకు ఐదు మంత్రి పదవులు ఇవ్వాలి

## దళిత నేత నీలం నాగేంద్రరావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 14)

జగన్ ఇచ్చినట్టే, చంద్రబాబు కూడా తన మంత్రివర్గంలో ఎస్సీలకు 5 మంత్రి పదవులు ఇవ్వాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంగోలులోని తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నీలం నాగేంద్ర మాట్లాడుతూ, రాష్ట్రంలోని కులాల వారీ జనాభాలో మాల, మాదిగల జనాభానే అధికమన్నారు. అందుకే జగన తన మంత్రివర్గంలో ఐదుగురు మాల, మాదిగ ఎమ్మెల్యేలు మంత్రి పదవులు ఇచ్చారన్నారు. ఈ 5 మంత్రి పదవుల్లో ఉపముఖ్యమంత్రి పదవి కూడా ఉందన్నారు. అత్యంత ప్రాధాన్యమైన హోం శాఖ (తానేటి వనిత), రోడ్లు భవనాల శాఖ (పినిపే విశ్వరూప్), పట్టణ అభివృద్ధి శాఖ (ఆదిమూలపు సురేష్), ఎక్సైజ్ శాఖ (కలత్తూరు నారాయణస్వామి) లను వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎస్సీ ఎమ్మెల్యేలకు ఇచ్చారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 29 మంది మాల, మాదిగ ఎమ్మెల్యేలు గెలుపొందితే, కేవలం ఇద్దరికీ మాత్రమే (మాల -1, మాదిగ -1) మంత్రి పదవులు ఇచ్చిన చంద్రబాబు తన ఇంట్లో రెండు మంత్రి పదవులు తీసుకున్నారన్నారు. సామాజిక న్యాయమంటే ఇదేనా అని నాగేంద్ర ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వంలో ఎస్సీలు దాడులకు గురయ్యారని, తప్పుడు కేసుల్లో ఇరుక్కున్నారని, ఆర్థికంగా అణిచివేయబడ్డారని, సంక్షేమ పథకాలకు దూరమయ్యారని, బాధలు, అవమానాలు అనుభవించారన్నారని నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ జగన్ పాలనలో దళితులకు రక్షణ లేదని, అందుకు ఉదాహరణగా డాక్టర్ సుధాకర్ పై వేధింపుల్ని, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, అంగన్వాడీ టీచర్ హనుమాయమ్మ హత్యల్ని, మేజిస్ట్రేట్ రామకృష్ణపై దాడుల్ని తెలుగుదేశం పార్టీ పదేపదే ప్రచారం చేసిందన్నారు. ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యల్ని తరచూ ప్రస్తావించి వైసీపీని డిఫెన్స్‌లో పడేసి, చంద్రబాబు దళితుల ఓట్లు దండుకున్నారన్నారు. వర్గీకరణ కోరే మాదిగల్ని, వర్గీకరణను వ్యతిరేకించే మాలల్ని నమ్మించి గంపగుత్తగా టిడిపి ఖాతాలో ఓట్లు కుమ్మరించుకున్న చంద్రబాబు, అధికారం వచ్చాక మాల మాదిగలకు కేవలం చెరొక మంత్రి పదవి ఇచ్చారని నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం




చేశారు. జగన్ పాలనలో సమస్యలపై పోరాడిన మాల, మాదిగలను చంద్రబాబు మోసగించాడన్నారు. రాష్ట్ర జనాభాలో చెరో 10 శాతం ఉన్న మాల, మాదిగలకు చెరొక మంత్రి పదవిచ్చి, 3 నుంచి 7 శాతం మధ్య జనాభా ఉన్న కమ్మ కులానికి 5, కాపులకు 4, రెడ్లకు 3, యాదవులకు 2, గౌడ, శెట్టి బలిజలకు 2, మత్స్యకార, కురుబ, కొప్పుల వెలమ, తూర్పు కాపు, మైనారిటీ, వైశ్య కులాలకు ఒక్కొక్క మంత్రి పదవి చంద్రబాబు ఇచ్చారన్నారు. బీసీలకు 8, కమ్మకు 5, కాపులకు 4, రెడ్లకు 3, ఆర్య వైశ్య, మైనారిటీలకు 1 చొప్పున కేటాయించిన మంత్రి పదవులు, తన మనసులో ఆ కులానికి ఉన్న గౌరవాన్ని బట్టి ఇచ్చారా లేక జనాభా దామాషాలో ఇచ్చారా అనే ప్రశ్నకు చంద్రబాబునాయుడు సమాధానం చెప్పాలని నాగేంద్ర డిమాండ్ చేశారు.

ఏపీలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో దళితుల ప్రాధాన్యం ఏమిటో మంత్రివర్గంలో ఎస్సీలకు ఇచ్చిన రెండు మంత్రి పదవులతో తేలిపోయిందన్నారు.

మోసపోవడం దళితులకు, మోసం చేయడం చంద్రబాబుకు కొత్త కాదని నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# శ్రీధర్‌రెడ్డికి ఇరువూరు శుభాకాంక్షలు





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 14)

మూడో సారి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో ఘనవిజయం సాధించిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి కొడవలూరు మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఇరువూరు శ్రీధర్‌రెడ్డి స్వీట్ తినిపి శుభాకాంక్షలు తెలిపారు.

# వికలాంగుల హక్కుల వేదిక కార్యాలయంలో సంబరాలు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 14)

వికలాంగులకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ అమలు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొదటి సంతకం వికలాంగుల పింఛన్లు పెంచుతూ మొదటి సంతకం చేయడంపై వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ధూళిపాళ్ళ మల్లికార్జున రావు హర్షం వ్యక్తం చేశారు. వికలాంగులకు పెంక్షన్ నెలకు 6000రూపాయలు పెంచడం పై శుక్రవారం కనిగిరి వికలాంగుల హక్కుల వేదిక కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నాయకులు సుబ్బయ్య కనిగిరి టౌన్ అందులఅధ్యక్షుడు పాలడుగు నాగేశ్వరరావు, శ్రీ రామలక్ష్మి, శ్రీనివాసులురెడ్డి, బీబీజాన్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# శివారు ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

## కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 14)

శివారు ప్రాంతలా అభివృధే ముఖ్య ధ్యేయమని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం సమస్య పరిష్కార కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఒకటో వార్డులోని బొగ్గుల గొంది కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో సమస్యలు అడిగి తెలుసుకోగా ఆ ప్రాంతంలో చిల్ల చెట్లు పెరిగి పారిశుధ్యనికి ఇబ్బందికరంగా ఉందని ప్రజలు తెలియజేయగా వెంటనే అధికారులను సమన్వయపరిచి వెంటనే చిల్ల చెట్లను తొలగించే ప్రక్రియను మొదలుపెట్టే విధంగా చర్యలు తీసుకున్నారు. అలాగే నీటి సమస్య తలెత్తకుండా ప్రస్తుతం ఉన్న బోరుకాక మరియొక బోరును ఏర్పాటు చేసి నీటి సమస్య లేకుండా చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో సమస్యలు లేకుండా పూర్తిస్థాయిలో పరీక్షిస్తామని చైర్మన్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న యానాది సంఘ నాయకుడు గురవయ్యను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రామనబోయిన ప్రశాంతి శ్రీనివాస్ స్థానిక నాయకులు కుమారి, రవణమ్మ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బక్రీద్ సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలి

## ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అధికారుల సమీక్షలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనలు



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 14)**

ముస్లింలకు పరమ పవిత్రమైన బక్రీద్ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో వసతులు కల్పించాలని కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశించారు. శుక్రవారం నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని తన కార్యాలయంలో నియోజకవర్గ మండలాల ఎంపీడీవోలు, ఇతర అధికారులు, ముస్లిం, మైనార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆమె మాట్లాడుతూ తన గెలుపులో కోవూరు నియోజకవర్గ ముస్లిం సోదర, సోదరీమణుల పాత్ర చాలా విలువైందని, తనకు అండగా నిలిచి ఒక ఆడపడుచుగా గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



సోమవారం బక్రీద్ సందర్భంగా కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలు ప్రార్థనలు చేస్తారని, వారి కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎక్కడా ముస్లిం సోదరులకు అసౌకర్యాలు కలగకూడదని, ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రార్థనా స్థలాల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలని, అన్నిచోట్లా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈద్గాల వద్ద తప్పకుండా ప్రత్యేక షామియానాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రార్థనలు చేసేందుకు ఎక్కడైనా సమస్యలు ఉంటే తప్పకుండా తన దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో కరెంట్ సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. పెద్ద ఎత్తున ప్రార్థనలు జరిగే ప్రాంతాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో షామియానాలు ఏర్పాటు చేయాలన్నారు. నీటి వసతి లేని చోట తప్పకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి ఉందన్నారు. అలాగే ఎండ తీవ్రత దృష్ట్యా మంచినీటి వసతి కల్పించాలన్నారు. వసతుల ఏర్పాటులో తప్పకుండా ఆయా స్థానిక నాయకుల సహకారం తీసుకోవాలని, ఆదివారం మధ్యాహ్నానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దల నుంచి వివిధ అంశాలపై సలహాలు, సూచనలు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎంపీడీవోలు, ఇతర అధికారులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# యువత భవిత తెలుగుదేశం తోనే అనుమోలు సాంబశివరావు



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 14)**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు తొలి సంతకం మెగా డీఎస్సీపై చేస్తూ యువత భవితకు అండగా నిలవడం తెలుగుదేశం పార్టీ విశ్వసనీయతకు అద్దం పడుతుందని మండల టిడిపి అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు అన్నారు. మండల కేంద్రమైన పొన్నలూరులో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఆర్ఆర్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి రావడానికి ఏటా జాబ్ క్యాలెండర్‌తో పాటు మెగా డీఎస్సీ పెడతానని దొంగ హామీలు ఇచ్చి మాట తప్పారని అన్నారు. ఎన్నికల ముందు హడావుడిగా 7500 పోస్టులు ప్రకటించడం తప్ప యువతకు చేసింది ఏమీ లేదని, కానీ చంద్రబాబు నాయుడు ఆ పోస్టులకు రెట్టింపుగా 16,347 డీఎస్సీ పోస్టులతో ముఖ్యమంత్రి హోదాలో తొలి సంతకం చేస్తూ నిరుద్యోగ యువతకు అండగా నిలిచారని కొనియాడారు. అలాగే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ రెండవ సంతకం, వృద్ధులకు వితంతువులకు పెన్షన్ పెంపు చేస్తూ మూడో సంతకం, అన్నా క్యాంటీన్ లు పునరుద్ధరణ చేస్తూ నాలుగో సంతకం, హిల్స్ సెన్సెస్ గణనపై ఐదవ సంతకం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల మన్ననలు పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు మండల ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు గుమ్మల వెంకట్రావు, సన్నమూరి నరసింహారావు, రమేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బంది సంక్షేమమే కర్తవ్యం

## జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 14)**

జిల్లాలోని పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రధమ కర్తవ్యంగా భావించి "పోలీస్ వెల్ఫేర్ డేను జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ అన్నారు. అర్జీలను స్వయంగా స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. పారదర్శకతతో కోరుకున్న చోటుకే ఖాళీల ఆధారంగా స్థాన చలనం చేశారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేశారు. అంకితభావంతో విధులు నిర్వహించాలి. అనధికారికంగా గైర్హాజరు కావద్దని సూచించారు. వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, మహిళా కానిస్టేబుల్స్ సమస్యల అర్జీలపై సత్వరమే



పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పరిపాలన విభాగ అధికారులకు ఆయా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు తగు ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. బదిలీలు, గ్రేడ్ ఇంక్రిమెంట్, బదిలీలు, సస్పెండ్ నుంచి రిలీవ్, సర్వీసు సంబంధిత సమస్యలు, డిప్యుటేషన్, భద్రత, ఆరోగ్య భద్రత, హౌసింగ్ లోను, అనారోగ్యం కారణంగా బదలాయింపు సంబంధిత అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు అర్జీలు స్వీకరణ ఉంటుందన్నారు. సిబ్బందికి , వారి కుటుంబ సభ్యులకు రావల్సిన ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి, అపరిష్కృతంగా ఉన్న పనులను తక్షణమే పరిష్కారం నిమిత్తం, తగిన సూచనలు చేసి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

## పేటలో బిజెపి నేతల సంబరాలు



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇన్‌ఛార్జి, జూన్ 14)**

భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి, ధర్మవరం ఎమ్మెల్యే వై సత్య కుమార్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా నియమితులైన సందర్భంగా శుక్రవారం నాయుడుపేట బిజెపి నేతలు సంబరాలు జరుపుకున్నారు. భారతీయ జనతా పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బొల్లకాయల విజయభాస్కర్ ఆధ్వర్యంలో పట్టణంలోని పోలేరమ్మ గుడి సెంటర్‌లో బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి, సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బిజెపి నాయకులు డాక్టర్ రంగనేని కృష్ణయ్య, అమరావతి రామయ్య, ఆశా చెంచు కృష్ణయ్య,కొప్పోలు సుబ్రమణ్యం, పుట్టు వీరయ్య, పొట్లపూడి శ్రీనివాసులు, సర్వాడి చంద్రశేఖర్ రెడ్డి, ఆడిటర్ రాజా, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉపకార వేతనానికి పొదలకొండపల్లె విద్యార్థుల ఎంపిక





**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 14)**

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొదిలికొండ పల్లెలో చదువుకున్న కొమ్మునూరి విధిత్ కుమార్ , వెంకట గురుచరణ్ అనే ఇద్దరు విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ కు ఎంపికైనారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగల రామసుబ్బారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు మిఠాయిలు పంచి అభినందించారు. ప్రతి ఏడాది తమ పాఠశాల నుంచి ఈ స్కాలర్షిప్‌కు విద్యార్థులు ఎంపికైతున్నారని తెలిపారు. గత ఏడేళ్ల నుంచి ఈ పరీక్షను విద్యార్థులు రాసేందుకు ప్రోత్సహించడంతో పాటు, అవసరమైన పరీక్ష ఫీజులను, స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తూ విద్యార్థులకు మార్గదర్శకత్వం, ప్రేరణ, సలహాలు మరియు సూచనలు నిరంతరం ఇస్తూ ప్రధాన పాత్ర వహించిన డాక్టర్ మొర్రి పిచ్చయ్య ను అభినందించారు. ఈ పాఠశాలకు డిప్యూటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 5 సంవత్సరాల పాటు ప్రతి ఏడాది 12000 రూపాయల చొప్పున 60000 రూపాయలు విద్యార్థుల బ్యాంకు ఖాతాలో జమ కానున్నాయని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

## ఈద్గాను పరిశీలించిన అధికారులు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 14)**

బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గా మైదానాన్ని శుక్రవారం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ కార్యదర్శి షేక్ రసూల్ మహమ్మద్, కమిటీ సభ్యులు షేక్ జిలానీ భాషా, షేక్ యాసిన్, పాల్గొని పరిశీలించారు.

# బిజెపిలో చేరిన అల్లంపాటి రంగారెడ్డి పార్టీ బలోపేతానికి అందరం కృషి చేయాలి

## బిజెపి జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 14)

భారతీయ జనతా పార్టీ నెల్లూరు జిల్లా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం చేజర్ల మండల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు గుండాల విజయ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జిల్లా ఉపాధ్యక్షులు బత్తల కృష్ణయ్య రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కుంకు బాలయ్య నాయుడు జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి బిజెపి సీనియర్ నాయకులు తెల్లబాటి వెంకట రామానాయుడు మండల ప్రధాన కార్యదర్శి కామంచి భద్రయ్య యానాదిరెడ్డి ఆధ్వర్యంలో చేజర్ల మండలం మాముడూరుకు గ్రామానికి చెందిన అల్లంపాటి రంగారెడ్డి భారతీయ జనతా పార్టీలో చేరడం జరిగినది. బిజెపి జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇటీవల చేజర్ల మండలం దళిత మోర్చా మండల అధ్యక్షులుగా ఎన్నికైన ఎల్లంటి శ్రీనివాసులు అలాగే గొల్లపల్లి బిజెపి దళిత నాయకులు కొమ్మల ప్రసాద్ ఆయనను కలిసి భారతదేశ ప్రధానమంత్రిగా నరేంద్ర దామోదర్ దాస్ మోదీ మూడవసారి వరుసగా ఎన్నికైనందున జిల్లా పార్టీ అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బిజెపి పార్టీ అధ్యక్షులు వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ విది విధానాలకు కట్టుబడి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు. మండలంలో భారతీయ జనతా పార్టీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతం చేయాలని కార్యకర్తలకు మండల నాయకులకు సూచించారు. మండలంలో జరిగే ప్రతి ప్రభుత్వ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ నుండి హాజరయ్యి ఈ రాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి ప్రవేశపెట్టే పథకాలకు సంబంధించిన విషయాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. భారతీయ జనతా పార్టీ మీద ప్రజలకు పూర్తిగా విశ్వాసం ఉందని దానిని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని ప్రజల ముందు ఉంచాలని మండల కమిటీల వారీగా కలిసికట్టుగా ప్రజలకు వివరించాలన్నారు.

# శ్రీగిరి నిలయునికి మేల్ చాట్ వస్త్రాల సమర్పణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 14)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ఆలయ కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు..ఇందిరా దేవి దంపతులు శుక్రవారం మేల్ చాట్ వస్త్రాలను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. మేల్ చాట్ వస్త్రాలను సమర్పించిన సీవీ రామకృష్ణారావు..ఇందిరా దేవి దంపతులకు ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

**15 నుంచి శ్రీగిరి బ్రహ్మోత్సవాలు**

శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 15వ తేదీ శనివారం నుండి ప్రారంభమై 19వ తేదీ వరకు జరుగనున్నాయి. శనివారం సాయంత్రం శ్రీగిరి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో ఆచార్య వరణం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మేదినీ పూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణ,వాస్తు హెూమం,ధ్వజ దండ,ధ్వజపట గరుడ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహిస్తారు. శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి కోరారు.

# ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా భారీ రక్తదాన శిబిరం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 14)

మార్కాపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నందు ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా మార్కాపురం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వివి నాగ రాజమన్నార్, మార్కాపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి సావిత్రి ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా పూర్వ జిల్లా వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్ ఎస్ సుబ్బారెడ్డి మరియు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి డిప్యూటీ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ మేజర్ రాంబాబు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ కే వంశీకృష్ణ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సయ్యద్ అబ్దుల్ వాజిద్, మరియు వివిధ రకాల స్పెషలిస్ట్ డాక్టర్లు, ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్, బేస్తవారిపేట ప్రైమరీ హెల్త్ సెంటర్ సి. హెచ్.ఓ అభిబ్ ఖాన్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, సానిటరీ వర్కర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు మరియు సెక్యూరిటీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారు. ఇంచార్జ్ పేథాలజీ డిపార్ట్మెంట్ ప్రధాన ఆచార్యులు డాక్టర్ కె మారుతీ దేవి రక్తదానం చేసిన రక్తదాతలందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి సి శార్వాణి, డాక్టర్ నీలిమ ప్రియదర్శిని, డాక్టర్ శాంతి ప్రియ, డాక్టర్ శ్రీకాంత్, బ్లడ్ బ్యాంకు ల్యాబ్ టెక్నీషియన్లు కే రవికుమార్, ఆర్ ఆంజనేయులు, ఎంవి శివశంకర్, స్టాఫ్ నర్సులు బి లక్ష్మీ ప్రసన్న, సత్యవాణి పాల్గొన్నారు.

# రక్తదానం పై అపోహలు వీడి ముందుకు రావాలి

## పలువురు రక్తదాతలకు ఘన సత్కారం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 14)

ఒక సారి కాదు రెండు సార్లు కాదు ఒకరు ఏకంగా 70 సార్లుకు పైగా రక్త దానం చేస్తే మరొకరు 25 సార్లు, ప్రపంచంలో అరుదుగా మాత్రమే దొరికే బాంబే బ్లడ్ గ్రూప్ ఎప్పుడు అవసరమైన ఇస్తామని ప్రకటించిన ఒకరు ఇలా... వీరంతా ఎందరిలో స్ఫూర్తి నింపుతూ అపత్కాల సమయంలో ఎందరి నో కాపాడే ప్రయత్నం లో వీరంతా మహా దాతలు అయ్యారు. జూన్ 14 ప్రపంచ రక్త దాతల రోజు సందర్భంగా అనేక సార్లకు పైగా రక్త దానం చేసిన ఐదుగురు మహా దాతలను జి జి హెచ్ డాక్టర్ దుర్గా దేవి చేతుల మీదుగా ఘంగా సన్మానించారు. మెడికల్ కాలేజీ ప్రాంగణంలో జరిగిన ప్రతేక కార్యక్రమాల్లో వీరి సేవలను కొనియాడారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్న అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూపరింటిండెంట్ డాక్టర్ దుర్గా దేవి మాట్లాడుతూ మొత్తం సమాజానికే ఇటువంటి వారు ఆదర్శం అని, వీరి స్ఫూర్తితో మరింత మంది అపోహలు వీడి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రావు, సన్మాన గ్రహితలని అభినందించారు. సన్మానం అందుకున్న వారు బ్లడ్ డొనేషన్ చేసిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, తదితరలు పాల్గొన్నారు.

# ఈ నెల 19, 20 తేదీల్లో జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 14)

రాష్ట్రప్రభుత్వం రబీ వ్యవసాయ సీజన్‌కు సంబంధించి ఆరు జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో కరవు పరిస్థితిని అంచనా వేయడానికి ఈ నెల 19, 20 తేదీల్లో ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర పశు సంవర్ధక, డెయిరీ శాఖ డైరెక్టర్ సందీప్‌శర్మ ఆధ్వర్యంలోని కేంద్రప్రభుత్వ ఉన్నతాధికారులు మన్ను జి.ఉపాధ్యాయ్, మదన్‌మోహన్ మౌర్యలతో కూడిన కేంద్ర బృందం జిల్లాలో కరువు పరిస్థితిని అంచనా వేయనున్నట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లాలో కేంద్ర బృందం పర్యటనకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని, కరువు నష్టాన్ని వివరించేలా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు, పవర్ పాయింట్ ప్రజంటేషన్, కేంద్ర బృందం పరిశీలించే ప్రాంతాలకు సంబంధించి రూట్ మ్యాప్‌లు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

# మార్కాపురం జిల్లా ఏర్పాటు హామీకి కట్టుబడి ఉన్నాం

## ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి




(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 14)

మార్కాపురంను జిల్లా చేయాలనే సంకల్పంతో గతంలో 45 రోజులపాటు అనేక ఉద్యమాలు చేసి మార్కాపురంను జిల్లా చేయాలని అనేక ధర్నాలు, ర్యాలీలు చేయడం జరిగింది. ఈ సందర్భంలో నారా చంద్రబాబునాయుడు కూడా జిల్లా చేస్తామని చెప్పి హామీ ఇవ్వడం జరిగింది. అలాగే గిద్దలూరు శాసనసభ్యులు ఈ యొక్క ధర్నా ర్యాలీలో కూడా పాల్గొని జయప్రదం చేసి కచ్చితంగా జిల్లా ఏర్పాటుకు కట్టుబడి ఉంటామని తెలియజేసి అందర్నీ సంతోషింప చేశారు. అందులో భాగంగా మరొకసారి గుర్తుచేయాలని ఉద్దేశంతో శుక్రవారం ఎమ్మెల్యేలకు మేమోరాండమును అందజేయడం జరిగింది. ఖచ్చితంగా జిల్లా ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా సాధన సమితి కన్వీనర్ కొండేటి రాజు, అధ్యక్షులు ఫాలుగుల్ల శివారెడ్డి, గౌరవాధ్యక్షులు బాలేశ్వరయ్య, ట్రెజరర్ మురళి, జెఎసి సభ్యులు విజయరామరాజు, చిన్ని సొసైటీ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీకాంత్, మహమ్మద్ భాష, నరసింహ, కొండేటి రాజేష్, నరసాపురం లక్ష్మీ, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆశాల సమస్యలపై ప్రభుత్వ హామీలు నెరవేర్చాలి

## యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఐ వి రాఘవమ్మ



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 14)

జూన్ 30, జులై 1 తేదీల్లో పొదిలిలో జరిగే ఆశా వర్కర్స్ జిల్లా క్లాసులను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఐ.వి.రాఘవమ్మ కోరారు. శుక్రవారం పొదిలిలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా క్లాసుల జయప్రదానికి సన్నాహకంగా యూనియన్ నాయకురాలు యస్.పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాఘవమ్మ మాట్లాడుతూ ఆశా వర్కర్లపై రోజు రోజు పనిభారం పెరుగుతుందన్నారు. ఆశాలకు ఏమాత్రం సంబంధం లేని విలేజీ హెల్త్ క్లినిక్ ,సచివాలయాలలో స్వీపింగ్, క్లీనింగ్ ఆశాలతో చేయించటం దుర్మార్గమన్నారు. ఫీల్డ్ వర్క్ కాకుండా రోజు విలేజ్ హెల్త్ క్లినిక్స్,సచివాలయాలలో డ్యూటీలు చేయాలనటం ఆశాల ప్రాథమిక విధులకు విఘాతం కలుగుతుందన్నారు. ఆశాల సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఆశాల సమస్యలపై చర్చించటానికి జరిగే జిల్లా క్లాసుల్లో ఆశాలందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యం. రమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నియంతృత్వ వైఖరితో ఆశాలు సమస్యలు పరిష్కారానికి నోచుకోలేద న్నారు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం నాయకత్వంలోని యన్‌డిఏ ప్రభుత్వం ఆశాలు పెండింగ్ సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఆశాలకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ బద్రత కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ పొదిలి, మర్రిపూడి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నాయకులు యం పరిశుద్ధం, కె పద్మ, శారద, సుల్తానమ్మ, ఇంద్రియాలు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల శాతం పెంచాలి

## మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 14)

అంగన్వాడీ కేంద్రల్లో పిల్లలు శాతాన్ని గణనీయంగా పెంచాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం కనిగిరి బొగ్గులగొంది కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల శాతాన్ని గణనీయంగా పెంచితే విద్యా వ్యవస్థలో పెను మార్పులు వస్తాయని, పిల్లల చదువు విషయంలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర చాలా గొప్పదిని, తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలను ఉపయోగించుకొని పిల్లలు హాజరు శాతాన్ని పెంచుతూ ప్రభుత్వం మంజూరు చేసే పథకాలను ఉపయోగించుకోవాలని చైర్మన్ కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రమణ బోయిన ప్రశాంతి, శ్రీనివాస్ యాదవ్, స్థానిక నాయకులు రమణమ్మ, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి కామెడీ చేసేందుకు సిద్ధమైన స్టార్స్.. త్వరలో 'ఎఫ్4'

ఫన్.. ఫ్రస్ట్రేషన్ అంటూ 'ఎఫ్2', 'ఎఫ్3'లతో కడుపుబ్బా నవ్వించారు వెంకటేశ్, వరుణ్ తేజ్. అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌లు ప్రేక్షకులకు కావాల్సినంత వినోదాన్ని పంచి నవ్వులు పూయించాయి. ఇప్పుడు వీటికి ఫ్రాంచైజీగా 'ఎఫ్4' రానుందని జోరుగా ప్రచారమవుతోంది.

మొదట 'ఎఫ్2'ను రూపొందించారు అనిల్.. ఆ చిత్రం మంచి విజయాన్ని సాధించి రూ.100 కోట్ల క్లబ్‌లో



చేరడంతో దానికి ఫ్రాంచైజీగా 'ఎఫ్3'ని తెరకెక్కించారు. ఇందులో వెంకీ , వరుణ్‌లకు తోడు సునీల్ కూడా కలిసి కామెడీ చేశారు. ఈ ముగ్గురి కామెడీ టైమింగ్‌కు తమన్నా, మెహ్రీన్‌ల గ్లామర్ తోడై ఇదీ సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమా సక్సెస్ మీట్‌లో నిర్మాత దిల్‌రాజు ఈ ఫన్ ఫ్రాంచైజీని కొనసాగిస్తామని చెప్పడంతో 'ఎఫ్4' ఎప్పుడు వస్తుందా అని అందరిలో ఆసక్తి పెరిగింది. తాజాగా దీనికి సంబంధించిన వార్త సోషల్ మీడియాలో ప్రచారమవుతోంది. త్వరలోనే ఇది పట్టాలెక్కనున్నట్లు తెలుస్తోంది.

'ఆర్ఆర్ఆర్' రికార్డును బ్రేక్ చేసిన 'కల్కి'.. సోషల్ మీడియాలో వైరలవుతోన్న విశేషాలివే

గతంలో 'ఎఫ్4' గురించి అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. ఇందులో వెంకటేశ్, వరుణ్ తేజ్‌తో పాటు మరో స్టార్ హీరో కూడా ఉంటారని స్పష్టంచేశారు. హీరోయిన్స్ కూడా మారతారని చెప్పారు. ప్రస్తుతం ఈ దర్శకుడు వెంకటేశ్‌తో ఓ సినిమా చేస్తున్నారు. సంక్రాంతి కానుకగా ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావిస్తున్నారు. దీని తర్వాత 'ఎఫ్4' మొదలుపెడతారని సమాచారం.



# మనల్ని విడదీసే వాళ్లు పుట్టలేదేమో

'గత 22ఏళ్లలో నేను ఈ క్షణాన్ని ఎప్పుడూ ఊహించుకోలేదు', 'ఇన్నేళ్లపాటు నేనీ క్షణం గురించి తప్ప మరో విషయం గురించే ఆలోచించలేదు'..దశాబ్దాల తర్వాత కలుసుకున్న ప్రేమికులు బసు, కృష్ణ మాట్లాడుకున్న మాటలివి. బసుగా టబు, కృష్ణ పాత్రలో అజయ్ దేవగణ్ నటించిన చిత్రమే 'ఔరో మే కహా దమ్ థా'. మ్యూజికల్ ప్రేమకథగా తెరకెక్కుతున్న ఈ సినిమాకి నీరజ్ పాండే దర్శకత్వం వహించారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమం ముంబయిలో జరిగింది. 'మనల్ని ఎవరూ విడదీయలేరు కదా! అలాంటి వాళ్లు ఇంకా పుట్టలేదేమో' అంటూ మొదలైన ట్రైలర్ మలుపులతో ఆద్యంతం ఆకట్టుకునేలా సాగింది. బసు, కృష్ణ ప్రేమ ముగిసిపోవడం, హత్య కేసులో కృష్ణ జైలుకు వెళ్లడం, బసుకి ఇంకొకరితో పెళ్లి జరగడం..లాంటి సంఘటనలతో ఆసక్తి కలిగిస్తోంది ట్రైలర్. 'నువ్వు అడిగే ప్రతీ ప్రశ్నకు నా దగ్గర ఐదు సమాధానాలున్నాయి', 'తను నీకు వంద రకాల బాధలు తలపెట్టాడంటే అతడే నీ బాధకు ఉపశమనమని అర్థం' అనే డైలాగులు చిత్రంపై అంచనాలను పెంచుతున్నాయి. ఈ సినిమా వచ్చే నెల 5న విడుదల కానుంది.

# అభిమాన హీరో సరసన?

సినిమాల్లో వారి నటనతో ఎంతో మంది అభిమానుల్ని సొంతం చేసుకునే అందాల తారలకూ ఆరాధించే నటీనటులుంటారు. తానెంతో అభిమానించే వ్యక్తి మమ్ముట్టి.. అని చెప్పుకొచ్చే సమంత.. ఇప్పుడు ఆయనతో తెరను పంచుకోనుందా? అంటే అవుననే అంటున్నాయి సినీవర్గాలు. మమ్ముట్టి ప్రధాన పాత్రలో గౌతమ్ వాసుదేవ్‌మేనన్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఇందులో కథానాయికగా సమంత నటిస్తున్నట్లు సమాచారం. "ఇంతక ముందు ఈ ప్రాజెక్టులో మమ్ముట్టికి జోడీగా నయనతారను ఎంపిక చేసింది చిత్రబృందం. కొన్ని కారణాల వల్ల ఆ స్థానంలో నటించడానికి సమంతను తీసుకున్నారు.




ప్రస్తుతం ఆమెతో చిత్రబృందం చర్చలు జరుపుతుంది. తెలుగు, తమిళ పరిశ్రమల్లో ఇప్పటికే తానెంటో నిరూపించుకున్న ఆమె..ఈ సినిమాతో మలయాళంలోకి అడుగుపెట్టనుంది. త్వరలో దీనికి సంబంధించిన వివరాల్ని ప్రకటించనుంది చిత్రబృందం" అని సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ నెల 15నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 'మా ఇంటి బంగారం'తో బిజీగా ఉంది సమంత.



# 27ఏళ్ల తర్వాత 'బార్డర్'లోకి సన్నీ

'బార్డర్'.. దేశ సైనికుల త్యాగాలను, వారి పోరాటాలను కళ్లకు కట్టినట్లు చూపించిన చిత్రమిది. ఇండో-పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా అప్పట్లో బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురిపించింది. 'బార్డర్'.. దేశ సైనికుల త్యాగాలను, వారి పోరాటాలను కళ్లకు కట్టినట్లు చూపించిన చిత్రమిది. ఇండో-పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా అప్పట్లో బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురిపించింది. సన్నీ దేవోల్, జాకీ ష్రాఫ్, సునీల్ శెట్టి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని జేపీ దత్తా తెరకెక్కించారు. కథ, భావోద్వేగాలు, సంగీతంతో ఎంతో మంది ప్రేక్షకుల హృదయాలను కదిలించిన ఈ చిత్రం విడుదలై ఈరోజుతో 27ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా దీనికి సీక్వెల్‌ను ప్రకటిస్తూ.. ఓ వీడియోను పంచుకున్నారు సన్నీ దేవోల్. "ఓ సైనికుడు 27ఏళ్ల తర్వాత తన మాటను నిలబెట్టుకోవడానికి 'బార్డర్'లోకి తిరిగొచ్చాడు. భారీ బడ్జెట్‌తో అతి పెద్ద వార్ ప్రాజెక్టుగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. అనురాగ్ సింగ్ రూపొందిస్తున్న ఈ సినిమా త్వరలో మీ ముందుకు రాబోతుంద"ని వ్యాఖ్యల్ని జోడించారు. జేపీ దత్తా, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇందులో ఆయుష్మాన్ ఖురానా కీలక పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది.



# రివ్యూ: పరువు..

వెబ్‌సిరీస్: పరువ్ష్మ నటీనటులు: నరేశ్ అగస్త్య, నివేదా పేతురాజ్, నాగబాబు, రమేశ్, సునీల్ కొమ్మిశెట్టి, ప్రణీత పట్నాయక్, మొయిాన్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, బిందు మాధవి తదితరుల్ష్మ సంగీతం: శ్రవణ్ భరద్వాజ్ష్మ ఛాయాగ్రహణం: విద్యాసాగర్ష్మ కూర్పు: విప్లవ్ష్మ నిర్మాతలు: సుస్మిత కొణిదెల, విష్ణు ప్రసాద్ లగ్గిశెట్టి్ష్మ స్క్రీన్‌ప్లే, డైలాగ్స్: సిద్ధార్థ్ నాయుడ్ష్మ దర్శకత్వం: సిద్ధార్థ్ నాయుడు, రాజశేఖర్ వడ్లపాట్ష్మ స్ట్రీమింగ్ వేదిక: జీ 5.

నివేదా పేతురాజ్ , నరేశ్ అగస్త్య , నాగబాబు ప్రధాన పాత్రల్లో రూపొందిన వెబ్‌సిరీస్ 'పరువు' . సిద్ధార్థ్ నాయుడు, రాజశేఖర్ వడ్లపాటి సంయుక్తంగా దర్శకత్వం వహించగా.. సుస్మిత కొణిదెల, విష్ణు ప్రసాద్ నిర్మించారు. ఈ సిరీస్ ఓటీటీ 'జీ 5' లో శుక్రవారం విడుదలైంది. స్టోరీ ఏంటి? ఎలా ఉందంటే?

**ఇదీ కథ:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పల్లవి అలియాస్ డాలీ (నివేదా పేతురాజ్).. తెలంగాణ అబ్బాయి సుధీర్ (నరేశ్ అగస్త్య)ను ప్రేమించి, పెళ్లి చేసుకుంటుంది. అది పల్లవి కుటుంబానికి నచ్చదు. ఫ్యామిలీతోపాటు బంధువులూ ఆమెను దూరం పెడతారు. హైదరాబాద్‌లో ఉంటున్న పల్లవి తన పెదనాన్న చనిపోయాడన్న వార్త తెలిసి దిగ్భ్రాంతికి గురవుతుంది. ఆయన్ను కడసారి చూసేందుకు భర్తతో కలిసి గుంటూరు సమీపంలోని సొంతూరికి బయలుదేరుతుంది. తనకు ఇష్టం లేకపోయినా పల్లవి బావ చందు (సునీల్ కొమ్మిశెట్టి) వారిని తన కారులో ఎక్కించుకోవాల్సి వస్తుంది. మార్గమధ్యలో చందు.. సుధీర్‌ను తక్కువ చేసి మాట్లాడతాడు. తన భర్తను అవమానించడాన్ని సహించలేని పల్లవి చందుతో వాగ్వాదానికి దిగుతుంది. తమను చంపేందుకే చందు తుపాకీ తెచ్చాడని పల్లవిలో అనుమానం మొదలవుతుంది. మన కోసం కాదని సుధీర్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోకుండా అతడిపై కోపగించుకుంటుంది. ఆ ఆవేశంలో సుధీర్.. చందుని రాడ్డుతో కొట్టడంతో చనిపోతాడు.



ఆ శవం ఎవరి కంటపడకుండా ఉండాలనే నిర్ణయానికొస్తారు. వ ం రో వ్తై వ్ర ,

చందుతో పెళ్లి నిశ్చయమైన స్వాతి (ప్రణీత పట్నాయక్) అతడు కనిపించడం లేదంటూ తెలిసిన వారందరికీ ఫోన్ చేస్తుంది. ఎమ్మెల్యే రామయ్య (నాగబాబు) తనకు కాబోయేవాడిని కిడ్నాప్ చేయించి ఉంటాడని ఆరోపిస్తుంది. మరి, రామయ్యకు చందుకు ఉన్న సంబంధమేంటి? చందు హైదరాబాద్ వెళ్లడానికి కారణమేంటి? ఎవరిని చంపేందుకు తుపాకీ తీసుకున్నాడు? పెదనాన్న చివరి చూపు కోసం వచ్చిన పల్లవికి ఎలాంటి అవమానాలు ఎదురయ్యాయి? చందు డెడ్ బాడీని ఏం చేశారు? ఈ వ్యవహారంలో పోలీసులు చక్రవర్తి (రాజ్‌కుమార్ కసిరెడ్డి), బాబ్జీ (మొయిాన్)ల పాత్రలేంటి? తదితర ప్రశ్నలన్నింటికీ సిరీస్ చూసి సమాధానం తెలుసుకోవాల్సిందే ).

**ఎలా ఉందంటే?:** ఈ సిరీస్ ప్రధానాంశమేంటో టైటిల్‌ని బట్టి చెప్పొచ్చు. పరువు హత్యల నేపథ్యంలో రూపొంది ఉంటుందని ప్రచార చిత్రాలను చూసి గెస్ చేయొచ్చు. థీమ్ అదే అయినా ఓ శవాన్ని ఎవరి కంటపడకుండా భార్యాభర్తలు ఏం చేశారన్నది మెయిన్ ప్లాట్‌గా చూపించారు. పరువు హత్య సబ్‌ప్లాట్‌గా ఉంటుంది. ఓ వైపు పల్లవి- సుధీర్ జోడీ ఊరికి పయనమవడం, మరోవైపు ఇంకో జంట ఇంటినుంచి పారిపోయే సన్నివేశాలతో సిరీస్ ప్రారంభమవుతుంది. వర్తమానం, గతంలో జరిగిన సీన్స్‌ను వెంటవెంటనే చూపించడంతో ప్రేక్షకుడిలో కొంత కన్‌ఫ్యూజన్ క్రియేట్ అయ్యే ఛాన్స్ ఉంది. ఎనిమిది ఎపిసోడ్లతో ఈ సిరీస్ రూపొందింది. ఒక్కో ఎపిసోడ్ నిడివి 40 నిమిషాలపైనే. పల్లవి- సుధీర్‌లను హైలైట్ చేస్తూ కథను నడిపించారు. చందును సుధీర్ హత్య చేసినప్పటినుంచి సిరీస్ మరింత వేగంగా సాగుతుంది. శవం కనిపించకుండా ఉండేందుకు వారిద్దరూ వేసే ప్లాన్‌లు ఆకట్టుకుంటాయి. కానీ, కొన్ని ప్రేక్షకుడి ఊహకు తగ్గవే.

ముందుకెళ్లేకొద్దీ మరిన్ని లేయర్స్, కొత్త పాత్రలు ఎదురవుతాయి. పల్లవి బంధువుల క్యారెక్టర్లు కొన్ని సీరియల్స్‌ను తలపిస్తాయి. చందు ఆచూకీ అన్వేషించే క్రమంలో స్వాతి.. ఎమ్మెల్యే రామయ్యను బ్లాక్ మెయిల్ చేయడం, పోలీసులు చక్రవర్తి, బాబ్జీల మధ్య వైరం, రామయ్యకు మరో పొలిటికల్ లీడర్ సుభాషానికి మధ్య రాజకీయ విభేదం.. వీటన్నింటినీ ఓ ఘటనకు లింక్ చేసిన తీరు థ్రిల్ పంచుతుంది. 'ప్రతిపక్షం అంటే చర్యకు ప్రతిచర్య చేయడం కాదు.. ప్రత్యామ్నాయం చూపడం' వంటి సంభాషణలు ఆలోచింపజేస్తాయి. ప్రేక్షకుడి ఊహకు భిన్నంగా క్లైమాక్స్ ఉంటుంది. ఓ ప్రత్యేక పాత్ర ద్వారా సీజన్ 2 ఉందని మేకర్స్ హింట్ ఇచ్చారు .

**ఎవరెలా చేశారంటే?:** 'సేనాపతి'తో తనేంటో నిరూపించుకొన్న నరేశ్ అగస్త్య 'పరువు'లోనూ అంతే సెటిల్డ్‌గా నటించి, ఆకట్టుకున్నారు. అభినయానికి అధిక ప్రాధాన్యం ఉన్న పాత్రలో నివేదా ఒదిగిపోయారు. నాగబాబు పవర్‌ఫుల్ రోల్ నిడివి ఇంకాస్త ఉంటే బాగుండేది. సునీల్, ప్రణీత పట్నాయక్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, మొయిాన్ తదితరులు తమ పాత్రలకు న్యాయం చేశారు. బిందు మాధవి పాత్రకు సీజన్ 2లో అధిక ప్రాధాన్యం ఉండనుంది. నేపథ్యం సంగీతం, ఛాయాగ్రహణం, ఎడిటింగ్.. ఇలా అన్ని విభాగాల పనితీరు బాగుంది. సిద్ధార్థ్ నాయుడు మాటలు, స్క్రీన్‌ప్లే ఆకట్టుకుంటాయి. సున్నితమైన అంశాన్ని ఎంగేజింగ్‌గా చెప్పడంలో సిద్ధార్థ్, రాజశేఖర్ మంచి మార్కులు కొట్టేశారు. నిర్మాణ విలువలు ఓకే.

కుటుంబంతో కలిసి చూడొచ్చా?: అసభ్యకర సన్నివేశాలు లేవు గానీ ఆ తరహా సంభాషణలు ఎక్కువగా ఉన్నాయి. పాత్రల డిమాండ్ మేరకే బూతులు వాడాల్సివచ్చిందని రచయితలు ఓ ఈవెంట్‌లో ఓ ప్రశ్నకు సమాధానం చెప్పారు. కొంతవరకే అయితే ఓకేగానీ దాదాపు పాత్రలన్నింటినీ ఆ తరహాలోనే క్రియేట్ చేశారు. ఈ సిరీస్ విషయంలో ఇదొక మైనస్. ఫ్యామిలీతో కలిసి చూడకపోవడమే బెటర్.




On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com